


నిష్పక్షపాత వార్తల నిలయం

# నేటిధాత్రి®

తెలుగు వార్తా పత్రిక


21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం





బుధవారం 4-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 263 రూ॥ 6.00









చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


ఎక్స్‌క్లూజివ్ నేటిధాత్రి exclusive

# రిజిస్ట్రార్ వా.. రింగ్ మాస్టర్ వా!?

- చిట్ కంపెనీల మూలంగా ఎవ్వరూ నష్టపోవద్దని సీఎం. రేవంత్ రెడ్డి చెప్పారు.
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.
- అందుకు అనుగుణంగా జీవో తెచ్చారు
- అయినా భయం లేకుండా బాధితులకు అన్యాయం చేస్తావా?
- కమీషన్ కోట్లు వస్తున్నాయని కక్కుర్తి పడతావా?
- ప్రజల జీవితాలను ఆగం చేస్తావా?

# "డీఆర్" వై...దుర్మార్గులకు దగ్గరుండి సేవ చేస్తావా?

## ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడతావా? ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తావా?

## నెల రోజుల క్రితం "డిఐజీ" ఆదేశాలిస్తే కాలయాపన చేస్తావా?

**పత్రిక ప్రకటన**

ఇందుమూలముగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా. జిలా రిజిస్ట్రార్ వరంగల్ గారి పరిధిలోగల **కనకదుర్గ చిట్‌ఫండ్స్ ప్రైలిమిటెడ్** నందు చిట్టీ వేసి డబ్బులు తిరిగి పొందని ఖాతాదారులకు తెలియజేయునది ఏమనగా మీకు రావలసిన డబ్బులు మీకు చెల్లించుటకు గాను మీ వద్ద కల రశీదులు మరియు తగిన ఆధారాలతో సహాయ చిట్ రిజిస్ట్రార్ గారి కార్యాలయం, వరంగల్ నందు ఈ యొక్క ప్రకటన వెలువడిన రోజు నుండి 7 రోజులలోపు ఫిర్యాదు చేసుకోగలరని తెలియచేయుచున్నాము.

**సం/- డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్,**
**వరంగల్ ఇ.నెం. 1-1-257/9, 100 ఫీట్ల రోడ్,**
**హన్మకొండ జిల్లా - 506004**



- చిన్నగా పేపర్ యాడ్ ఇచ్చి చేతులు దులుపుకుంటావా?
- సమ్మక్క జాతర సమయం చూసి యాడ్ జారీ చేస్తావా?
- బాధితులు చూడకుండా చేసి మోసం చేస్తావా?
- కనీసం మూడు, నాలుగు పేపర్లలో ఇవ్వాల్సిన యాడ్ ఒక్క పత్రికకు పరిమితం చేస్తావా?
- సరిగ్గా జాతర సమయం చూసి వారం రోజులు గడువిస్తావా?
- మీడియాకు కనీసం ప్రెస్ నోట్ ఇచ్చినా అందరికీ తెలిసేది కదా?
- జనం సొమ్ము అంటే అంత అలుసై పోయిందా?
- పేదలను మోసం చేస్తే అడిగే దిక్కుండదని అనుకుంటున్నావా?

# అడుగడుగునా "నేటిధాత్రి" నిఘా నేత్రం గమనిస్తూనే వుంటుంది?

- బాధితులకు సొమ్ము న్యాయంగా అందేవరకు అక్షర పోరాటం చేస్తూనే వుంటుంది?
- ప్రజల సొమ్ముకు కాపలా దారువా లేక, దొంగలకు సద్ది కడతావా?
- కమీషన్లకు ఆశపడి కంత్రి గాళ్ళతో చేతులు కలుపుతావా?

# కనక దుర్గ చిట్ ఫండ్ కంపెనీకే కొమ్ము కాస్తావా?

- ప్రభుత్వం తెచ్చిన "జీవో" కు విరుద్ధంగా వ్యవహారం నడుపుతావా?
- ప్రజల సొమ్మును కమీషన్లకు ఆశపడతావా?
- బాధితుల సొమ్ము మింగాలని చూస్తావా?
- ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి చిట్ కంపెనీకి ఊడిగం చేస్తావా?
- డిపాజిట్ సోమ్మంతా కంపని మింగేందుకు సహకరిస్తావా?
- ప్రజలకు మొండి చేయి ఇచ్చేందుకు సాయపడతావా?

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

బాధిత ప్రజలు చెప్పిన విషయాలతో "నేటిధాత్రి" అందిస్తున్న సంచలన కథనం

హైదరాబాద్, నేటిధాత్రి:

ప్రజల సొమ్మంటే ఎంత అలుసైపోయింది. దాచుకోండి..దోచుకుంటామన్నంత సులువైపోయింది. ప్రజల బలహీనతలను ఆసరా చేసుకొని కొన్ని చిట్ ఫండ్ కంపనీలు చేస్తున్న అరాచకాలకు, కొంత మంది రిజిస్ట్రార్లు తోడు కావడంతో జనం సొమ్ముకు భద్రత లేకుండాపోతోంది. దాచుకున్న సొమ్ము తిరిగి చేతికొస్తుందన్న నమ్మకం లేకుండాపోతోంది. వరంగల్ లో అదే జరిగింది. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కుర్చీలో కూర్చున్న ఓ రిజిస్ట్రార్ వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. గతంలోనే ఓసారి నేటిధాత్రి దినపత్రిక కనకదుర్గ చిట్ ఫండ్ కంపనీ బాదితులను ఎలా మోసం చేస్తోందనే దానిపై అనేక వార్తలు రాసింది. అందుకు రిజిస్ట్రార్లు ఎలా సహకరిస్తున్నారు. కమీషన్లు ఎలా తీసుకుంటున్నారన్న దానిని వెలుగులోకి తెచ్చింది. దాంతో కొంత కాలం చేయాల్సిన మోసాన్ని వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ బాదితులను మోసం చేసేందుకు కొంత సమయం తర్వాత రెడీ అయ్యారు. జనం సొమ్ము కోట్లాది రూపాయలతో ఉడాయించాలని

మిగతా 12లో



# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

బుధవారం 4-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 263 రూ॥ 6.00





# కాంగ్రెస్ కొంప కూల్చనున్న రేవంత్ దూకుడు?




## ప్రహసనంగా మారిన టెలిఫోన్ ట్యాపింగ్ విచారణ

## బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతున్న రేవంత్ చర్యలు

- కేసీఆర్ విచారణతో పరాకాష్టకు చేరిన రాజకీయం
- రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు
- మున్సిపల్ ఎన్నికల తరుణంలో రేవంత్ తప్పటడుగులు
- ఆంధ్ర రాజకీయాలను తలపిస్తున్న తెలంగాణ
- ఇద్దరు మాజీ 'దేశం' నాయకుల మధ్య నలుగుతున్న కాంగ్రెస్
- సీనియర్ కాంగ్రెస్ నేతల్లో అయోమయం
- అధికారంలో వున్నా ఆవహించిన నైరాశ్యం











హైదరాబాద్, నేటిధాత్రి:

విచారణలో ప్రశ్నలు మాత్రమే వుండాలి. ఉద్దేశాలుండకూడదు. ఒకవేళ ఉద్దేశాలే ప్రశ్నలను శాసిస్తే, చరిత్ర తన నిశ్శబ్ద కలంతో నిజాన్ని లిఖించక మానదు. అందువల్లనే ఎప్పుడైనా చరిత్రను కక్షతో రాయకూడదు, నిజంతోనే రాయాలి. అప్పుడే చరిత్ర నిలిచి వెలుగుతుంది. ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులపై జరుగుతున్న సిట్ విచారణను చూస్తుంటేకాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు శైలి స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు సెంటిమెంట్, భావద్వేగ రాజకీయాలకు కేం ద్రమైన తెలంగాణలో నేడు పరస్పర కక్షపూరిత రాజకీయాలు కలుషితం చేస్తున్నాయి. తెలంగాణ ఆత్మగౌరవానికి సంకుచితార్థం తీసే యత్నాలు జరుగుతున్నాయి. ఇది ఏ ఒక్క కేసీఆర్‌కో లేదా రేవంత్‌కో పరిమితం కాదు. తెలంగాణ యావత్తు ప్రజానీకానికి సంబంధించింది. ఆంధ్ర రాజకీయాల ప్రభావం క్రమంగా తెలంగాణ రాజకీయాలపై పెరుగుతున్న పరిస్థితికి ప్రధాన కారణం రేవంత్‌రెడ్డికి, చంద్రబాబుతో వున్న సాన్నిహిత్యం. దీని పుణ్యమాని ఆంధ్రలోని తిట్ల రాజకీయా లు తెలంగాణలోకి ప్రవేశించాయి. రేవంత్ అధికారంలోకి రానంత వరకు మౌనంగా వున్న ఆం ధ్ర మీడియా ఇప్పుడు జడలు విప్పి బీఆర్ఎస్‌పై తన అక్కసును ప్రదర్శిస్తోంది. చంద్రబాబు డైరెక్షన్ రాజకీయాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. రేవంత్, కేసీఆర్‌ల మూలాలు తెలుగుదేశం పార్టీలో వుండటం, చంద్రబాబు ఒకప్పటి వీరి బాస్ కావడాన్ని పరిశీలిస్తే (ఇప్పుడు ఒకరిరితో మరొకరికి పడకపోవచ్చు) "మాజీ తెలుగుదేశం నాయకుల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరాటం వెనుక తెలుగుదేశం అధినేత చంద్రబాబు హస్తం ప్రచ్ఛనంగా వుందని" అని ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ ఆత్మగౌరం స్థానాన్ని ఇప్పుడు, రేవంత్ వర్సెస్ కేసీఆర్ ఆక్ర మించగా, కాంగ్రెస్‌లో మొదటినుంచి వున్న స్వయం ప్రకాశం లేని సీనియర్ నాయకులు ఎటూ తేల్చుకోలేని సందిగ్ధ స్థితికి గురికావడం వర్తమాన తెలంగాణ రాజకీయ ముఖచిత్రం. ఏదో కారణంపై వేధింపులు, జైళ్లకు పంపడం వ్యక్తిగతంగా ఎదురులేకుండా చేసుకునే రాజకీ యాలు నెరపడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల శైలి. కానీ తెలంగాణలో భావజాలం, ఉద్యమం, ఒక కారణం ప్రధాన పాత్ర పోషిస్తాయి. వర్తమానానికి వస్తే, సిట్ విచారణ పేరుతో హరీశ్‌రావు, కేటీఆర్ చివరకు కేసీఆర్‌ను కూడా పిలిచి అడిగిన భేతాళ ప్రశ్నలు, ఇచ్చిన విక్రమార్క సమాధానాలు, విచారణపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం చివరకు వ్యక్తిగత దూషణల స్థాయికి దిగజారింది. టీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి ఏకంగా తెలంగాణ స్టైల్‌లో తిట్లపురాణం మొదలుపెట్టారు. ఇక ఆం ధ్రమీడియా టెలిఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను తెలంగాణ ఆత్మగౌరవం అన్న కవరింగ్ ఇస్తు న్నారంటూ ఆరోపిస్తోంది. తెలంగాణ ఆత్మగౌరవం పేరుతోనే కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని నడిపారు. మరి 1983లో ఎన్టీఆర్ "తెలుగువారి ఆత్మగౌరవం" పేరుతోనే కదా అధికారంలోకి వచ్చింది. అంతకుముందు మనల్ని ఢిల్లీలో మదరాసీలనేవారు. అప్పుడు తెలుగువారి ఆత్మగౌరవా నికి చిహ్నంగా ఎన్టీఆర్ నిలిస్తే, ఇప్పుడు తెలంగాణ ఆత్మగౌరవానికి కేసీఆర్ గుర్తుగా వున్నారు. టెపిఫోన్ ట్యాపింగ్ అనేది ఒక ప్రక్రియ. అది భద్రతా చర్యల్లో భాగం కనుక ఏ ప్రభుత్వం అధి కారంలో వున్నా కొనసాగుతూనే వుంటుంది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్-1885 కింద ప్రజల భద్రతకోసం దేశవ్యాప్తంగా ఇది అమల్లో వుంది. ఇది నిర్దిష్ట నియమాలకు లోబడి జరుగుతుంది.ఆ నియమాలను ఉల్లంఘించినప్పుడు ఇది వివాదమవుతుంది. ఈ అంశమే ఇప్పుడు అధికార, విపక్షాల మధ్య సంఘర్షణలకు దారితీస్తోంది.

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ వద్ద పిల్లర్ కుంగిపోయింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లకు కూడా కొన్ని పగుళ్లు ఏర్పడ్డాయన్నది ఆరోపణ. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వీటికి మరమ్మతులు చేసినట్లయితే పెద్ద ఖర్చు భారం కాకుండా ఈపాటికి ప్రాజెక్టు సాధారణ స్థితిలో పనిచేసేది. కాలయాపన వల్ల డ్యామేజీ ఎక్కువ అవుతుందనే అంశం ఇక్కడ ప్రధానం. తప్పుకు బీఆర్ఎస్‌ను దోషిగా నిలబెట్టడంలో తప్పులేదు కానీ, అంతపెద్ద ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టకుండా ఇప్పటివరకు సాగదీయడం అధికార కాంగ్రెస్ తప్పిదం. ఇక్కడ రాజకీయ ప్రయోజనం కంటే, అంతపెద్ద ప్రాజెక్టు భద్రత, లక్షల ఎకరాల సాగునీటి లభ్యత ప్రమాదంలో పడుతుంది. ఇప్పటికీ కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అంటూ విమర్శలు ఆపి రాష్ట్రహితం కోసం దాని మరమ్మతులు చేపట్టాలి. అప్పుడు మాత్రమే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది. సాంకేతిక లోపాలు, వరదలు ఇందుకు ప్రధాన కారణమన్నది ఎన్‌డీఎస్‌ఏ వర్గీకరించింది. నిజం చెప్పాలంటే దేశంలో గతంలో నిర్మించిన ప్రాజెక్టులు దెబ్బతిన్న సంఘటనలు చాలానే వున్నాయి. సిక్కిం తీస్తా 1200 మెగావాట్ల 3హెచ్‌ఈపీ ప్రాజెక్టు 2023లో గ్లేసియర్ సరస్సు ఒక్కసారిగా విరుచుకుపడటంతో కొట్టుకుపోయింది. 2024లో కర్ణాటకలో రూ.650 కోట్లతో నిర్మించిన బరాజ్ మూడునెలల్లోనే కూలిపోయింది. 2023-24 సంవత్సరాల్లో హిమాచల్ ప్రదేశ్‌లో సంభవించిన వరదల కారణంగా 14-16 జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. 2023లో పోలవరం ప్రాజెక్టుకు చెందిన 150 మీటర్ల "టో య్-వాల్"కు వంపు ఏర్పడింది. అదేవిధంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నది. 2023-24 సంవత్సరంలో అరుణాచల్ ప్రదేశ్‌లోని 2వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు కొండచెరియలు విరుచుకుపడి బాగా దెబ్బతిన్నది. 1978లో ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మించిన అన్నమయ్య ప్రాజెక్టుకు 2021లోసామర్థ్యానికి మించి 3.25లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో తెగిపోయింది. 8మంది మరణించగా 50మంది గల్లంతయ్యారు.సమీపంలోని పింఛా ప్రాజెక్టు కూడా దెబ్బతిన్నది. 2024లో పెదవాగు ప్రాజెక్టు భారీ వరదల కారణంగా తెగిపోయింది. ఒక్కోదానికి ఒక్కో కారణం. కారణమేదైనా తప్పిదాన్ని సరిచేయడం విజ్ఞత కలిగిన ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం పనికిరాకుండా పోతే, తెలంగాణలో దేశంలోనే అత్యధిక వరి దిగుబడి ఎట్లా సాధ్యం?

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సోమవారం కేసీఆర్‌ను, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ విచారించడం తో రాష్ట్రంలో రాజకీయ దుమారం పరాకాష్టకు చేరింది.ఆయనకు నోటీసులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభం నుంచే వివాదం మొదలై, చినికి చినికి గాలివానలా మారింది. నోటీసులు జారీచేయం లో నిబంధనల ఉల్లంఘున జరిగిందని కేసీఆర్ వేసిన ప్రశ్నలకు సరైన సమాధానాలు లేవు. మాజీ ముఖ్య మంత్రి, 65 సంవత్సరాలు దాటిన వృద్ధుడిని ప్రశ్నించేందుకు అవసరమైన విధివిధానాలు పాటించడంలో సిట్ వైఫల్యం స్పష్టంగా వెల్లడి కావడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఆంధ్ర రాజకీయాల్లో మాదిరిగా భీష్మించుకొని కూర్చోకుండా కేసీఆర్ నందినగర్ నివాసానికి రావడంతో విచారణ సజావుగా సాగింది. ఇక్కడ వారేం అడిగారు, ఈయనేం సమాధానం చెప్పారన్న సంగతి కంటే, బీఆర్ఎస్ ఈ అవకాశాన్ని తన బలప్రదర్శనకు చక్కగా వినియోగించుకున్నదనేది కీలకం. చంద్రబాబు డైరెక్షన్‌లో, రేవంత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఎపిసోడ్‌ను పరిశీలిస్తే బూమరాంగ్ అవడం ఖాయమన్నట్టు స్పష్టమవుతోంది. ఇక్కడ చంద్రబాబు డైరెక్షన్ అని ఎం దుకనాల్సి వస్తున్నదంటే పచ్చమీడియా రేవంత్‌కు అండగా నిలవడం. ఇద్దరు మాజీ తెలుగుదేశంనేతల మధ్య ఇప్పటి తెలుగుదేశం దర్శక నేపథ్యంలో జరుగుతున్న ఈ హైడ్రామాలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలిగిపోవడం అట్లావుంచి, తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారిన విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రభుత్వంపై రాజకీయాలు ఆధిపత్యం సాధించిన సరికొత్త వాతావరణం ప్రస్తుతం తెలంగాణలో కనిపిస్తోంది.

మనదేశ ప్రజల్లో సెంటిమెంట్ ఎక్కువ! ఒకప్పుడు జనతా ప్రభుత్వ హయాంలో ఇందిరాగాంధీని జైలుకు పంపించామన్న జనతాపార్టీ నేతల తాత్కాలిక ఆనందం, తర్వాతి ఎన్నికల్లో ఉక్కుమహిళ పై దేశ ప్రజల్లో వెల్లువెత్తిన సానుభూతి సునామీలో ఒక్కసారిగా కొట్టుకుపోయింది. తర్వాత జన తాపార్టీ ముక్కలు చెక్కలైంది. అదేవిధంగా కేసీఆర్ అహంకారంపై ఆగ్రహించిన తెలంగాణ ప్రజలు ఆయన్ను అధికారానికి దూరం చేస్తే, ఇప్పుడు రేవంత్ కూడా అదే అహంకారంతో కేసీఆర్‌నుఇబ్బంది పెట్టడం వల్ల కాంగ్రెస్సే నిండా మునుగుతుంది తప్ప గులాబీ బాస్‌కు ఏం కాదు. కానీచంద్రబాబు కక్ష సాధింపు రాజకీయాలను వంటబట్టించుకున్న రేవంత్ దూకుడుతో వ్యవహరించడం ప్రశ్నార్థకమవుతోంది. కేసీఆర్ తాను అధికారంలో వున్నప్పుడు తప్పిదాలు చేసివుండవచ్చు. కానీ ప్రతీకార ధోరణి ఎంతమాత్రం తగదు. ఇది కాంగ్రెస్ నాయకుల్లో కనిపించదు. మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో, అధికార ప్రభుత్వం తమను రాజకీయ వేధింపులకు గురిచేస్తున్నదంటూ బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లే అవకాశాన్ని చేజేతులారా కల్పించినట్టే అవుతున్నది. కేసీఆర్ విచారణను నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలు, ర్యాలీలే ఇందుకు నిదర్శనం. అదీకాకుండా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

తెలుగుదేశం రాజకీయాలు నరనరానా జీర్ణించుకున్న ఇద్దరు మాజీ టీడీపీ నాయకుల మధ్య కొనసాగుతున్న ఈ రాజకీయపోరు, సీనియర్ కాంగ్రెస్ నేతలకు కొరుకుడుపడని సమస్యగా మారింది. వీరికి అనుభవిస్తున్న అధికారం ఆనందం ఇవ్వని పరిస్థితి నెలకొంది. గమనిస్తే రేవంత్ తన రాజకీయ సుస్థిరత కోసం వ్యూహాత్మకంగా ముందుకెళుతున్నారనుకోవాలి. రేవంత్ వుంటే చంద్రబాబుకు అనుకూలం కనుక పచ్చమీడియా అండగా నిలుస్తోంది. ఇప్పటికే రెండు రాష్ట్రా మధ్య సరిహద్దుల స్పష్టత మసగబారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న తరుణంలో, కేసీఆర్ మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను లేవదీస్తే, రేవంత్‌కు కష్టం. రేవంత్ ప్రతి చర్య వెనుక చంద్రబాబు వు న్నారన్న అభిప్రాయం తెలంగాణలో బలీయంగా నాటడంలో ఇప్పటికే బీఆర్ఎస్ చాలావరకు కృతకృత్యురాలైంది. తెలుగువారి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ఏవిధంగా ప్రతీకగా నిలిచారో, తెలంగాణ అస్తిత్వానికి కేసీఆర్ అంతే నిలిచారు. ఇప్పుడు కేసీఆర్ ఆత్మగౌరవం ఒక సెంటిమెంట్‌గా ప్రజ ల్లోకి వెళితే కాంగ్రెస్ భవిష్యత్తు కష్టం. రేవంత్ అధికారంలో వున్నంతవరకే చంద్రబాబు కొంతవ రకు రాజకీయం చేయగలుగుతారు. బీఆర్ఎస్ రాష్ట్ర పగ్గాలు చేపడితే మాత్రం తెలుగుదేశం ప్రాదుర్భావ ఆశలు అడియాశలైనట్టే!




నేటిధాత్రి ®
నిష్పక్షపాత వార్తల నిజరూపం
తెలుగు వార్తా పత్రిక
21st ANNIVERSARY 2004-2025

బుధవారం 4-02-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 21 సంచిక : 263 రూ॥ 6.00



## న్యాయవాదులకు ఆహ్వానం

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలలో 21 సంవత్సరాల అనుభవం కలిగిన "నేటిధాత్రి" పత్రికలో "లీగల్ టీం" లో చేరడానికి జిల్లాల వారీగా ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన ఆశావాహులైన న్యాయవాదులకు ఆహ్వానం.

ఆసక్తి కలిగిన న్యాయవాదులు బయోడేటాను కింది నెంబర్లకు వాట్స్అప్ ద్వారా పంపించగలరు.

"నేటిధాత్రి" కార్యాలయము. రోడ్ నెం. 3, బంజరహిల్స్,హైదరాబాద్
9908658888, 9989138678, 6281849354








# మన సహనమే విజయానికి బాట

- విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం
- అదే ఇప్పుడు మనలను ముందకు తీసుకెళ్లింది
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ
- ఎన్‌డిఎ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.



## వాణిజ్య ఒప్పందం స్థిరత్వానికి మైలురాయి

- గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయం
- ఒప్పందాన్ని స్వాగతించిన సీఎం చంద్రబాబు

అమరావతి, నేటిధాత్రి:

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలు రాయి అని సీఎం చంద్రబాబు అన్నారు. దీన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. టారిఫ్‌లను 18శాతంకు తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఇది నిరంతర గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయమని చెప్పారు. మోదీ నాయకత్వంలో భారత్ ఒక గ్లోబల్ ఆర్థిక శక్తిగా తన స్థానం మరింత పటిష్ఠం చేసుకుంటోందన్నారు. ఈ ఒప్పందం భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ముఖ్యంగా ఏపీలోని యువత, రైతులకు విస్తృత అవకాశాలను సృష్టించనుందని చంద్రబాబు పేర్కొన్నారు. భారత్ – అమెరికాల మధ్య కుదిరిన చారిత్రక వాణిజ్య ఒప్పందాన్ని చంద్రబాబు నాయుడు స్వాగతించారు. ఈ ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి చారిత్రాత్మక మైలురాయి అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ ఒప్పందం కుదరడంపై సీఎం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సుంకాలను 18 శాతానికి తగ్గించడం ద్వారా ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని సీఎం పేర్కొన్నారు. నిరంతరం ప్రపంచ వృద్ధిని కాంక్షించేలా ఈ దార్శనిక నిర్ణయం ఉందని వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థికశక్తి కేంద్రంగా తన పాత్రను సుస్థిరం చేసుకుంటోందన్నారు సీఎం. భారత ఎగుమతుల్లో పోటీతత్వాన్ని గణనీయంగా పెంచేలా ఒప్పందం ఉందన్నారు.



## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

- ఉచితాలను ప్రకటించడానికి కాదు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి


హైదరాబాద్, నేటిధాత్రి:

ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్–2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

- వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు
- అధికారులతో సమీక్షించిన సీఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్, నేటిధాత్రి:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 –27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమీషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం

- దాడులు, అక్రమ కేసులు పెరిగాయి
- పార్లమెంట్ ఆవరణలో వైకాపా ఏంపీల నిరసన
- రాష్ట్రపతి పాలన విధించాలని ఏంపీల డిమాండ్


న్యూఢిల్లీ, నేటిధాత్రి:

కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు,


04 లో

# గురుకులాలు విద్యా నిలయాలా..? విషసర్పాలకు ఆవాసాలా..?

### విద్యార్థిని పూర్తి బాధ్యత రేవంత్‌దే : హరీష్ రావు



హైదరాబాద్, నేటిధాత్రి: ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న గురుకులాల పరిస్థితి అధ్వాన్నం చేశారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పాము కాటుకు గురై ఆస్పత్రిలో చేరిన గురుకుల విద్యార్థిని ప్రాణానికి పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్మిత పాముకాటుకు గురై మృత్యువుతో పోరాడుతుందన్న ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యార్థిని పాము కాటుకు గురైన వార్త తనను ఎంతో కలిచివేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి గారు మీ పాలనలో గురుకులాలు విద్యా నిలయాలా..? లేదంటే విషసర్పాలకు ఆవాసాలా..? అని హరీష్ రావు ప్రశ్నించారు.సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా...? రూ.20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని చెబుతూ రంగుల లోకం చూపిస్తూ గురుకులాలను మీరు గాలికి వదిలేయడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో పిచ్చి మొక్కలు తొలగించే దిక్కులేదు. చిమ్మచీకట్లో లైట్లు వేసే నాథుడు లేడు. అపరిశుభ్రత కారణంగా గురుకులాల్లో నేడు కుక్కకాట్లు, పాము కాట్లు సర్వసాధారణంగా మారిపోవడం అత్యంత దుర్మార్గమైన విషయమన్నారు.గురుకుల బిడ్డలకు కడుపునిండా తిండి లేదు.. ప్రాణాలకు రక్షణ లేదన్నారు. సీఎం హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి విదేశాల్లో ఫొటోలకు పోజులిస్తే ఇక్కడ పేద విద్యార్థులు ఆస్పత్రి పాలై కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు చదువుకోవడానికి వెళ్తున్నారా..? లేక చావుతో పోరాడేందుకు వెళ్తున్నారా..? అని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పతనమవుతున్న గురుకులాలను కాపాడాలి. రాజకీయ కక్షసాధింపుల మీదున్న శ్రద్ధలో కొంతైనా పేద పిల్లల బతుకుపై పెట్టండని విజ్ఞప్తి చేశారు.



## స్త్రీశక్తి పథకంతో పెరిగిన ఆక్యుపెన్సీ

- డిమాండ్‌కు తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు పెంచాలి
- సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్

విజయవాడ, నేటిధాత్రి:

డిమాండ్‌కు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈనెల 2, 3

04 లో

## అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయండి: బండి



కరీంనగర్, నేటిధాత్రి:

మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు కష్టపడి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.'నేను కేసీఆర్‌ని గజగజ వణికించా. నా తలకాయను కేసీఆర్.. ఆరు ముక్కలు చేస్తానని గతంలో అన్నారు. ఆయన సంగతి తేల్చేందుకు ఫామ్‌హౌస్‌కు వస్తానని చెప్పా. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్‌ను బజార్‌కు లాక్కొచ్చా. కేసీఆర్ మెడలు వంచింది నేనే. నేను ఎవరికీ భయపడను. గడీల నుంచి కేసీఆర్‌ను నేనే బయటకు తీసుకువచ్చా' అని బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, నేటిధాత్రి:

గత ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా కల్పించందని అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లిలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ పట్టణం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ గెలిస్తేనూ పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు. బిఆర్ఎస్ బిజెపిల వ్లల ఒరిగేదేమీ లేదన్నారు. వారికి ఓటేసినా దండగేనని అన్నారు. ఈయన వెంట సహకార సంఘం మాజీ ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న తమను కాదని పార్టీ కండువా కప్పుకోకుండా ఉన్న నూతన అభ్యర్థులకు బీఫారాలు ప్రకటించడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమత, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ రెండవ వార్డ్ అభ్యర్థిగా ప్రకటించగా అతను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.



## మేడారం జాతర విజయవంతం

- ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం
- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క

హైదరాబాద్, నేటిధాత్రి:

ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర

04 లో



## సంయమనంతో టిడిపి కార్యకర్తలు

- రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా బాబు కంట్రోల్
- వైసిపి ఉచ్చులో పడకుండా చూసుకుంటున్నాం
- హోంమంత్రి వంగలపూడి అనిత

అమరావతి, నేటిధాత్రి:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ఎలాంటి పొంతన లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కార్యకర్తల కోపాన్ని అదుపు తప్పకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులకు వాస్తవాలను వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను గుర్తు చేసి.. వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించామన్నారు హోంమంత్రి. టీడీపీ కార్యకర్తలను

04 లో

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని అడ్డుకోవడమే వైకాపా ఎజెండా..

▶▶గత తెదేపా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనే రాయలసీమకు నీరు.. ▶▶అందుకే వైకాపా నాయకులు అలజడులు సృష్టిస్తున్నారు.. ▶▶ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్... ▶▶సంస్కారం మరచిన వైకాపా నాయకులు.. ▶▶రాయలసీమకు జగన్ చేసింది శూన్యం...



**చిత్తూరు, నేటిధాత్రి:** రాష్ట్రంలో వైకాపా నాయకులు వరుసగా చేస్తున్న అరాచకాలు, అలజడులు చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని అడ్డుకోవడమే అజెండాగా కనిపిస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంపై మంగళవారం బీవీ రెడ్డి కాలనీలోని గృహంలో విలేకరులతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన, 48 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని నోటికొచ్చినట్లు మాట్లాడడం వైకాపా నాయకుడు అంబటి రాంబాబు సంస్కారానికి నిదర్శనమని, ప్రజలు దీన్ని గమనిస్తున్నారన్నారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ పనికిమాలిన చర్యలతో రాష్ట్రంలో అలజడులు సృష్టించి.. పెట్టుబడుదారులను, పారిశ్రామికవేత్తలను భయపెట్టి రాష్ట్రం నుంచి వెళ్ళగొట్టడం లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ రెడ్డి ఆలోచనలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడుస్తోందని, జాతీయ, ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన నారా చంద్రబాబునాయుడు గారిని చులకనగా మాట్లాడడం తెదేపా శ్రేణులు, సానుభూతిపరులు, ప్రజలు తట్టుకోలేకపోతున్నారని రానున్న రోజుల్లో వైకాపా నాయకులకు మరింత గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. గతంలో వైయస్ జగన్ రెడ్డి భార్య వైయస్ భారతి రెడ్డి పై సోషియల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి ఘనత కూటమి ప్రభుత్వానిదేనని.. తెలుగుదేశం పార్టీ ఎంతో క్రమశిక్షణతో పనిచేస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చిత్తూరులో మాపై, మా కార్యకర్తలపై దాడులు జరిగినా.. ఫలితాల తర్వాత ఎలాంటి ప్రతి దాడులు మేము చేయలేదని, ఇది మా పార్టీ క్రమశిక్షణ, నిబద్ధతకు నిదర్శనం అన్నారు. రాజకీయ విమర్శలను రాజకీయంగానే ఉండాలని, వ్యక్తిగతంగా,కుటుంబ పరంగా ఉండరాదని.. ఈ విషయాన్ని జగన్ రెడ్డి వాళ్ల పార్టీ నాయకులకు అవగాహన కల్పించాలన్నారు.

▶▶**రాయలసీమకు నీటిపై డ్రామాలు..** అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు రాయలసీమలోని ప్రాజెక్టులను పట్టించుకోని జగన్.. ఇప్పుడు దీక్ష పేరుతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేసిన ఇసుక దోపిడీ కారణంగానే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ప్రాణ నష్టం జరిగిందని, ఐదు సంవత్సరాల్లో ఏ ఒక్క ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయలేదు, ప్రాజెక్టుల నిర్వహణలో గాలికి వదిలేసారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 19 నెలల్లోనే రూ. 8వేల కోట్లు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసినట్లు చెప్పారు. చిత్తూరుకు అడివిపల్లి రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా పనులు జోరుగా సాగుతుందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలోనూ.. చిత్తూరు, పూతలపట్టు, జీడి నెల్లూరు నియోజకవర్గాలకు నీటి సరఫరాపై కలెక్టర్ తో చర్చించారని చెప్పారు. కృష్ణా జలాలను కుప్పంకు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదేనని.. గతంలో వైయస్ జగన్ సినిమా సెట్టింగ్లను వేసి డ్రామాలు చేశారని విమర్శించారు. వైకాపా నాయకులు ఎన్ని డ్రామాలు వేసిన వారిని నమ్మే పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు లేరని.. ఇలానే దిగజారుడు రాజకీయాలు చేస్తే భవిష్యత్తులో ఆ 11 సీట్లు మిగలవన్నారు. సమావేశంలో మేయర్ ఎస్ అముద, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# విబి జి రామ్ జి కార్మికుల వేతనాలపై స్పష్టత - కోరిన తిరుపతి ఎంపీ గురుమూర్తి



**తిరుపతి, నేటిధాత్రి:** వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ (విబి జి రామ్ జి) పథకం కింద గ్రామీణ కార్మికులకు అందించే వేతనాలు, పథక అమలుకు సంబంధించిన పలు అంశాలపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంటులో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ సమాధానం ఇచ్చారు. విబి జి రామ్ జి చట్టం 2025లోని సెక్షన్ 10 ప్రకారం, ఈ పథకానికి సంబంధించిన వేతన రేట్లను కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ ద్వారా ప్రకటించే అధికారం కలిగి ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విధంగా ప్రకటించే వేతనాలు సంబంధిత రాష్ట్రాలు, జిల్లాల్లో అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఇజీఎస్) ఇస్తున్న వేతనాల కంటే తక్కువగా ఉండకూడదని చట్టంలోనే స్పష్టంగా పేర్కొనబడిందన్నారు. అలాగే, విబి జి రామ్ జి పథకం కింద ప్రత్యేకంగా వేతనాలు నోటిఫై చేసే వరకు ప్రస్తుతం అమలులో ఉన్న ఎంజీఎన్ఆర్ఇజీఎస్ వేతనాలే వర్తిస్తాయని తెలిపారు. గ్రామీణ కార్మికులకు వేతనాల చెల్లింపులో ఎలాంటి ఆలస్యం జరగకుండా, వారానికి ఒకసారి లేదా ఎట్టి పరిస్థితుల్లోనూ 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించాలనే నిబంధనను చట్టం కల్పించిందన్నారు.మస్టర్ రోల్ పూర్తయిన తేదీ నుంచి 15 రోజుల్లో వేతనాలు చెల్లించకపోతే, ఆలస్యానికి పరిహారం పొందే హక్కు కార్మికులకు ఉంటుందని కూడా చట్టంలో స్పష్టంగా పొందుపరచినట్లు మంత్రి వివరించారు. ఈ విధంగా విబి జి రామ్ జి పథకం ద్వారా గ్రామీణ కార్మికులకు వేతన భద్రత, పారదర్శకత, సమయపాలన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన ఏర్పాట్లు చేసిందని ఆయన వెల్లడించారు.

# మేడారం జాతర విజయవంతం

**ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం**
**ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి**
**మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క**

**హైదరాబాద్, నేటిధాత్రి:** ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరకోసం ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రూపురేఖలను మారుస్తామని అన్నారు. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలను మించి జరిగిందని మంత్రి తెలిపారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో 'తిరుగు జాతర' నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు. జాతర ఏర్పాట్లపై కొందరు కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చేవారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఇది తన మూలాలను, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

# ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

**మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు**
**అదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది**
**అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు**

**న్యూఢిల్లీ, నేటిధాత్రి:** అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో విలేఖరులతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏవి మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ పేల కొట్టాలో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, ఆ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారు. నాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడటానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి అది మోదీపై కేసు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

# దేశ ఆర్థిక వ్యవస్థకు 'గేమ్ ఛేంజర'

**అమెరికా ట్రేడ్ డీల్‌పై టిడిపి ఎంపి సానా సతీశ్**

**న్యూఢిల్లీ, నేటిధాత్రి:** అమెరికా పన్నుల తగ్గింపు దేశ ఆర్థిక వ్యవస్థకు 'గేమ్ ఛేంజర' అని టీడీపీ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ మరో చరిత్రాత్మక ఆర్థిక విజయాన్ని సాధించిందని అన్నారు. భారత్– అమెరికా ట్రేడ్ డీల్ ప్రధాని మోదీ దూరదృష్టి గల నాయకత్వానికి మరో నిదర్శనంగా నిలిచిందన్నారు. ఆసియా దేశాల్లోనే భారత్‌కు అత్యల్ప పన్ను శాతం వర్తించడం విశేషమన్నారు. దీని వల్ల 'ఓజీటు తిని ఎనిటతిజీ' ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఎంపీ వివరించారు. నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా తీరప్రాంతాలకు భారీ లాభాలు చేకూరుస్తుందని ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. కాకినాడ నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా, సముద్ర ఆహార ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు మరింత సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడిందన్నారు. దీని ద్వారా వేలాది మంది మత్స్యకారులు, రొయ్యల రైతులు, ఎగుమతిదారులకు ఆర్థిక భద్రతతో పాటు కొత్త ఆశలు కలుగుతాయని అన్నారు. ట్రేడ్ డీల్ భారత్– అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా తీర్చిదిద్దే కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి దేశహితమైన నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి టీడీపీ ఎంపీ సానా సతీష్ బాబు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలేది లేదు

**కేబినేట్‌కు ముందు ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు భేటీ**

**అమరావతి, నేటిధాత్రి:** తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని ఆయన చంద్రబాబుకు స్పష్టం చేశారు. పవిత్రమైన ఆలయ ప్రాభవాన్ని దెబ్బతీసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. బీజేపీ తరపున మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ విషయంలో కూటమిలో పూర్తి ఏకాభిప్రాయం ఉందని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన ఈ కుట్రలను ప్రజల ముందు పెట్టి, క్షేత్రస్థాయిలో వారిని ఎండగట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక భేటీలో కూటమిలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.. నాదెండ్ల మనోహర్, నారా లోకేష్,పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ కూడా పాల్గొన్నారు. తిరుమల ఆలయ పవిత్రత, ప్రసాదాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, దోషులను విచారణ ద్వారా బహిర్గతం చేస్తామని కూటమి నేతలు ముక్తకంఠంతో తీర్మానించారు.అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని 1వ బ్లాక్ లో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను క్యాబినెట్ తీసుకుంది.

# మరిచిపోయిన హ్యాండ్ బ్యాగు చోరీ కేసు ఛేదించిన పోలీసులు



**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్ నగరంలో మరిచిపోయిన హ్యాండ్ బ్యాగును చోరీ చేసిన కేసును ఇంతజార్గంజ్ పోలీసులు ఛేదించారు. కొత్తగూడెం నివాసి శ్వేత అను మహిళ 26-01-2026 తెల్లవారుజామున వేములవాడకు వెళ్లేందుకు వరంగల్ వెంకట్రామ్ వద్ద బస్సు ఎక్కే సమయంలో ఆత్రుతలో టీవీఎస్ షోరూం ముందు హ్యాండ్ బ్యాగును మరిచిపోయింది.ఆ బ్యాగులో మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.30,000 నగదు మరియు ఒక వివో స్మార్ట్ ఫోన్ ఉన్నాయి. ఈ విషయమై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంతజార్గంజ్ పోలీసులు క్రైమ్ నంబర్ 34/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల విచారణలో టీవీఎస్ షోరూం ఉద్యోగి పల్లకొండ వేణు దొంగిలించాలనే ఉద్దేశంతో తన భార్య కళ్యాణి, తల్లి సరోజనతో కలిసి ముఖాలకు మాస్కులు కట్టుకొని వచ్చి, మరిచిపోయిన బ్యాగు తమదేనని వాచ్మెన్ కేదారిని నమ్మించి మోసపూరితంగా బ్యాగును తీసుకెళ్లినట్లు గుర్తించారు.సీసీ కెమెరాలు, ఐటీ కోర్ సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు కొనసాగించిన పోలీసులు ఈరోజు వాహనాల తనిఖీ సమయంలో నిందితులు వేణు, కళ్యాణిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్ మరియు రూ.5,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నగదును ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైంది.నిందితులను రిమాండ్‌కు తరలించగా, వేణు తల్లి సరోజన పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ఇంతజార్గంజ్ ఇన్స్పెక్టర్ ఎం.ఏ. షుకూర్, ఎస్సై సందీప్, పిఎస్సై తేజ, కానిస్టేబుల్స్ దీపక్, సురేష్ మరియు ఐటీ కోర్ సిబ్బంది సల్మాన్ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

# సంయమనంతో టిడిపి కార్యకర్తలు

**రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా బాబు కంట్రోల్**
**వైసిపి ఉచ్చులో పడకుండా చూసుకుంటున్నాం**
**హోంమంత్రి వంగలపూడి అనిత**

**అమరావతి, నేటిధాత్రి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ఎలాంటి పొంతన లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కార్యకర్తల కోపాన్ని అదుపు తప్పకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులకు వాస్తవాలను వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను గుర్తు చేసి.. వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించామన్నారు హోంమంత్రి. టీడీపీ కార్యకర్తలను గత 20 నెలలుగా పూర్తి అదుపులో పెట్టాం కాబట్టే రాష్ట్రంలో మంచి వాతావరణం నెలకొందని తెలిపారు. కార్యకర్తల కడుపు మంటను అర్థం చేసుకున్నప్పటికీ, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా సరైన సమయంలో హితబోధ చేసిన నాయకుడు చంద్రబాబు అని అనిత కొనియాడారు. గతంలో 'బోసు డీకే' అనే పదానికి బూతు సృష్టించి టీడీపీ కార్యాలయంపై జగన్ దాడి చేయించారని గుర్తుచేశారు. ఆ పదానికే తన కార్యకర్తలకు బీపీలు వచ్చాయని జగన్ సమర్థించుకున్నారని మంత్రి తెలిపారు. వైసీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషిస్తుంటే కూడా తమ అధినేత ఇప్పటికీ సంయమనం పాటించమని సూచిస్తున్నారని హోంమంత్రి అన్నారు. హింసను, విధ్వంసాన్ని ప్రోత్సహించి ప్రజలను జగన్ భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. బూతులు, హింసాత్మక చర్యలతో వైసీపీ నేతలను ప్రోత్సహించారే తప్ప ఏనాడైనా తప్పుని చెప్పారా అంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఒక క్రిమినల్ ఆలోచనా విధానాలను, విజనరీ ఆలోచనలను అర్థం చేసుకున్నారని అన్నారు. క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పు చేయాలనే ఆలోచన రావాలంటేనే భయపడేలా రాజకీయ రౌడీలకు పోలీసు ట్రీట్మెంట్ ఇస్తామని మంత్రి అనిత వార్నింగ్ ఇచ్చారు.

# రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

▶▶నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.... ▶▶తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ.... ▶▶ఎక్స్ వేదిగా కేసీఆర్ విమర్శలు

**హైదరాబాద్, నేటిధాత్రి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు.

# కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు

▶▶కల్తీ సంగతి తెలిసీ మౌన్గా వైకాపా పాలకులు..... ▶▶సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు..... ▶▶కేబినేట్ వివరాలను వెల్లడించిన మంత్రులు

**అమరావతి, నేటిధాత్రి:** కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రి వర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో కలిసి పయ్యావుల విడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత వైకాపా పాలకులు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారని మండిపడ్డారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినందున రిపోర్టులో ఉన్నవారందరికీ నేరంలో భాగం ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే గత ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారని పయ్యావుల ప్రశ్నించారు. ఈ తప్పుల్లో వారు భాగస్వాములుగా ఉన్నారని ఆధారాలు చెబుతున్నాయన్నారు. సీఎఫ్‌టీఆరఐ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నివేదిక సూచనల మేరకు చర్యలు తీసుకోని వారిని ఏమనాలని అన్నారు. కల్తీ నిర్ధారణ పరీక్ష వద్దనగానే సడలింపు ఇవ్వటం నేరాన్ని ప్రోత్సహించటమే అన్నారు. ఏ నేపథ్యంలో సీఎం చంద్రబాబు మాట్లాడారో గ్రహించాలి. లడ్డూల్లో కొబ్బరి, పందికొవ్వు, పామాయిల్, ఫిష్ ఆయిల్ ఉన్నట్టు ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చింది. ల్యాబ్ నివేదికలోని సమాచారం ప్రకారమే సీఎం మాట్లాడారు. తెలిసిన వాస్తవాలను సీఎం ప్రజల ముందు పెట్టాలా? వద్దా? తితిదే ప్రక్షాళనలో భాగంగా ఈవోగా శ్యామలరావును నియమించారు. నమూనాలను సీఎఫ్‌టీఆరఐకి అప్పటి ఈవో పంపించారు. 2022లో నివేదిక ఇస్తే దాన్ని సరిచేయకుండా ముందుకెళ్లారు. పాలసేకరణలో 3 నిబంధనలు పెట్టారు. 4లక్షల లీటర్ల పాలు సేకరించే సంస్థగా ఉండాలని నిబంధన ఉంది. సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న భోలే బాబా డెయిరీకి వెళ్లారు. నకిలీ పత్రాలతో టెండర్లలో పాల్గొన్నారని తెలిసినా మౌనం వహించారు. చుక్కపాలు లేకుండా నెయ్యి చేయడంపై ప్రజల్లో చర్చ జరగాలి. నేరంలో భాగస్వాములపై చర్యలు తీసుకునేందుకే విచారణ కమిషన్. బ్రిటీష్ పాలకులు, నిజాం కూడా తిరుమల వ్యవస్థలోకి చొరబడలేదని పయ్యావుల అన్నారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శకత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప.. రాజకీయ కోణం ఇందులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీని వైకాపా సమర్థిస్తోందా అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. హిందూధర్మం మూలాలను దెబ్బతీసే విధంగా వైకాపా చర్యలు ఉన్నాయని దుయ్యబట్టారు.

# తిరుమల లడ్డూ కల్తీపై కేబినెట్ కీలక నిర్ణయం

▶▶అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్.... ▶▶కమిషనర్ ఆఫ్ ఎంక్వరీస్‌కు అప్పగించాలని తీర్మానం

**అమరావతి, నేటిధాత్రి:** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మూడు గంటలపాటు కొనసాగిన క్యాబినెట్ భేటీలో సిట్ నివేదికపైనా చర్చ జరిగింది. ఆ నివేదికలో పాత్రధారులపైనే చర్యలకు సిట్ సిఫార్సు చేసిందని అభిప్రాయపడింది. సిట్ విచారణ, ఛార్జ్‌షీట్, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. ఈ మూడింటిపై అధ్యయనం చేసి వాస్తవాల సమర్పణకు కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్‌షీట్‌లో ఎందుకు నమోదు చేయలేదనే దానిపై సమావేశంలో చర్చ జరిగింది. సిట్ నివేదికలోని లోపాలను సరిచేసి, అసలు సూత్రధారులను కనుగొనేందుకు కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. అప్పట్లో పర్చేస్ కమిటీకి సభ్యులు కాని భూమన కరుణాకర్ రెడ్డిని ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలిచారని సీఎం చంద్రబాబుకు మంత్రులు వివరించారు. అయితే, ఆనాడు కమిటీ సభ్యులుగా ఉన్న తనను, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని పిలవలేదని మంత్రి పార్థసారథి చెప్పారు. రసాయనాల మిశ్రమం కలిసిన లడ్డూలను అయోధ్యకు కూడా పంపారని కేబినెట్‌లో అధికారులు పేర్కొన్నారు. నెయ్యి టెండర్ నిబంధనలను మార్చడంపైనా మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్ దక్కించుకున్నారని, టెండర్ నిబంధనలను మార్చినప్పటికీ ఈఓగా ఉన్న సింఘాల్ అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంపై పలువురు మంత్రులు ప్రశ్నలు లేవనెత్తారు. 2022లో సీఎఫ్‌టీఆరఐ నివేదికలో నెయ్యి కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా పట్టించుకోకపోవడంపై చర్చించారు. అప్పటి అధికారులు బాలాజీ, సుబ్రహ్మణ్యం దానిని పక్కన పెట్టారని నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌డీడీబీ నివేదికలో యానిమల్ ఫ్యాట్ ఉందని తేలిందని, అదే విషయాన్ని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రులు తెలిపారు. సిట్ నివేదికలో కొంతమంది పేర్లు పేర్కొన్నప్పటికీ, చివరి ఫైడింగ్స్‌లో వాటిని పేర్కొనకపోవడంపై చర్చ జరిగింది. ఈ లోపాలన్నింటిపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించింది. టెండర్ ప్రక్రియలో లోపాలపై దృష్టి సారించాలని కమిటీకి మంత్రిమండలి సూచించింది. సహకార డెయిరీలను పక్కన పెట్టేందుకు పథకం రూపొందించారని కేబినెట్ పేర్కొంది. సహకార డెయిరీలను పక్కన పెట్టడం ద్వారా బోగస్ డెయిరీలను రంగంలోకి తీసుకువచ్చారని అధికారులు వివరించారు. దీనిపైనా ఎంక్వైరీ కమిటీ దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. అడ్వకేట్ జనరల్, సీనియర్ అధికారుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఛైర్మన్ సుబ్బారెడ్డి పాత్ర గురించి సిట్ నివేదికలో ఏమైనా పేర్కొన్నారా? అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఛార్జ్‌షీట్‌లో యానిమల్ ఫ్యాట్ ఉందని పేర్కొన్నారా? అని కూడా పవన్ అడిగారు. ఛార్జ్‌షీట్‌లోని 35వ పేజీలో స్పష్టంగా పేర్కొన్నారని పవన్‌కు చెప్పారు అధికారులు. అసలు సూత్రధారులను వెంటనే తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. సిట్ నివేదికలో లోపాలు ఉన్నాయని, అసలు సూత్రధారులను బయటకు తీసుకురాలేకపోయిందని మంత్రులు పేర్కొన్నారు. అందువల్ల వెంటనే అసలు సూత్రధారులపై ఫోకస్ పెట్టాలని మంత్రులు చెప్పారు. ఈ విషయాలను బహిర్గతం చేసేందుకే కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే ఎవరిపై చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



# అంతిమ యాత్ర

మంచితనాన్ని మంటకలిపి పైకం వెనకాల పరుగెత్తి...పరుగెత్తి అలసిపోయి కట్టెల పాన్పుపై ఆదమరిచి....కనురెప్పలు అర్పి నిదర్పోతున్న ఓ మనిషీ! నీ వెంట ఏమి రాదు అని గ్రహించలేక పోయినావు... చివరి అంతిమ యాత్రలో మోయడానికి....నేను అంటే నేను అని పోటీపడాలి అలా బ్రతకాలి...నీ బంధుగణంకోసం, నీ రక్తసంబంధం కోసం...నీ వాళ్ళ కోసం కుళ్ళు కుతంత్రాలు చేసి...కూడబెట్టిన నీ పైకంపై డేగలా వాలారే తప్ప...ఒక్కరు కూడా నీ దరిదాపుల్లోకి రాలేరు...చివరి అంతిమ యాత్రలో మోయడానికి...నేను అంటే నేను అని పోటీపడాలి అలా బ్రతకాలి...బంధుజనం స్వజనం వరకు....తలపై రూపాయి నాణెం ఒంటిపై తెల్లని వస్త్రం...నోట్లో గుప్పెడు బియ్యం నీతో కలిసి బూడిద...అయితేయే తప్ప నీతో కలిసిరావు...ఒక్క నీ మంచితనం తప్ప అదితెలుసుకో లేక...పోయావా ఓ మనిషి..!చివరి అంతిమ యాత్రలో మోయడానికి....నేను అంటే నేను అని పోటీపడాలి అలా బ్రతకాలి..సంపాదించు కోవాల్సింది కేవలం ఆస్తిఅంతస్తులు... మాత్రమే కాదు నలుగురు మిత్రులని కూడా....అని మరచి పోయావా ఓ మనిషి..! చివరి అంతిమ యాత్రలో మోయడానికి...నేను అంటే నేను అని పోటీపడాలి అలా బ్రతకాలి....నీకు చేతనైతే నలుగురికి సాయంచేయు, కానీ...కీడు మాత్రం చేయకు అని కోరుకుంటూ...



మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ
మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం.
చరవాణి 9347042218

## రైలు ఢీకొని యువకుడి దుర్మరణం



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ రైల్వే ట్రాక్పై సోమవారం అర్ధరాత్రి రైలు ఢీకొని రమేష్ (30) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతని కుడి కాలు శరీరం నుండి వేరైంది, రెండు చేతులు, కాళ్లు విరిగిపోయాయి, తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అతను మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీర్తీ కమలను ఆశీర్వదించండి ఎమ్మెల్యే జి ఎస్ ఆర్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బీర్తీ కమల మధునయ్య కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీర్తీ కమలను మధునయ్య 17వ వార్డులో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తారు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఇంకా మూడు సంవత్సరాలు ఉంటుంది కావున వార్డు ప్రజలు అందరూ ఆలోచించి బీర్తీ కమల చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించండి వార్డు అభివృద్ధికి అందరూ సహకరించండి అని వారు అన్నారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 17వార్డు ఇన్చార్జి టౌన్ యూత్ అధ్యక్షుడు పృథ్విరాజ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## 29 వార్డులో పుల్ల మహేష్ ను గెలిపించాలి



▶▶ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, నేటిధాత్రి:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 29వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి పుల్ల మహేషు ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29వ వార్డు స్థానిక కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి పుల్ల మహేష్ ను భారీ మెజార్టీతో గెలిపించాలి ఇతర వార్డులో వాళ్లు వచ్చి ఇక్కడ పోటీ చేస్తున్నారు కావున స్థానికుడు పుల్ల మహేషు కావున ప్రజలందరూ మహేష్ చెయ్యి గుర్తుపై ఓటు వేయాలని ఓటర్ మహాశీలకు విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## దూసుకు వెళ్తున్న సిపిఎం అభ్యర్థి ప్రచారం




**పరకాల, నేటిధాత్రి:** పట్టణంలో సిపిఎం పార్టీ బలపరిచిన 2వ వార్డు అభ్యర్థి బొచ్చు విజయ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం మంగళవారం వార్డులో నిర్వహించారు. ఈ ప్రచారానికి సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2వార్డు అభివృద్ధి లక్ష్యంగా సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని ప్రతి గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలు పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమని సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బొచ్చు రాజు,మడికొండ ప్రశాంత్,బొచ్చు ఈశ్వర్,బొజ్జ హేమంత్,చుక్క శాంతి కుమార్,మహిళలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ గద్దె పై గులాబీ జెండా ఎగిరేస్తాం

▶▶16,20 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులు నాని, మంద వేణుగోపాల్





**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ ఎన్నికల బరిలో 16 వ వార్డ్ అభ్యర్థిగా జి కృపానందం(గ్యాస్ నాని),20 వ వార్డ్ బరిలో మంద వేణుగోపాల్ లు ఉన్నారు.స్థానికంగా బిఆర్ఎస్ పార్టీ కి ఎక్కువ ఓటు బ్యాంక్ ఉన్న నేపథ్యంలో ఇక్కడ మున్సిపాలిటీ గద్దె పై గులాబీ జెండా ఎగిరేస్తాం అని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బారాస,సిపిఐ పార్టీ కలిసి మునిసిపాలిటీలో పోటీ చేస్తున్న నేపథ్యంలో ప్రచారంలో సైతం ముందు నిలుస్తున్నారు.తమను గెలిపిస్తే వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తమ పై పెట్టుకున్నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తామని కౌన్సిలర్ అభ్యర్థులు నాని, మంద వేణుగోపాల్ లు అంటున్నారు.

## పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం..



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు దివంగత ఆర్.బక్కయ్య గుప్త గారి సతీమణి మరణించిన విషయం తెలిసి ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై.నరోత్తం గారు ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి పార్థివ దేహానికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఆర్. బస్వరాజ్,విజయ్ కుమార్, గోపిరాజ్,వీరేశలింగం,మజిద్,చెంగల్ జైపాల్,తదితరులు ఉన్నారు,

## చేర్యాల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

▶▶పదవ వార్డు అభ్యర్థి మేడిశెట్టి ఉమా శ్రీధర్ గెలిపించాలి



**చేర్యాల, నేటిధాత్రి:** చేర్యాల మున్సిపల్ పరిధిలో ఈరోజు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రచారం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన బిఆర్ఎస్ నాయకులను గెలిపించాలని ప్రజలను కోరారు ఈ సందర్భంగా పలు వార్డులలో తిరిగి ప్రచారం చేశారు10 వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి మేడిశెట్టి ఉమా-శ్రీధర్ ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు, తెలుసుకుని వాటి అమలుకు కచ్చితంగా కృషి చేస్తానని అభ్యర్థి మేడిశెట్టి ఉమా శ్రీధర్ ప్రజలకు మాట ఇచ్చారు. గెలిచిన, ఓడిన ప్రజలలోనే, రాజకీయాలలోనే ఉన్నామని ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించామని, ఇక ముందు కూడా వార్డు సభ్యులకు ఏ సమస్య వచ్చినా దగ్గర ఉండి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత ఎన్నికలలో ప్రజలందరూ సహకరించిన ఒక ఓటుతో ఓడిపోయామని అదృష్టం వరించలేదని అన్నారు. ఈసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలందరికీ మనస్ఫూర్తిగా వేడుకుంటున్నారు.. మీ అందరి సహకారంతో చేరాలలోనే అగ్రగామిగా మన వార్డును చేర్చిదిద్దామని మాట ఇచ్చారు ఈ సందర్భంగా ఔషర్ల కిషోర్ కాసుల శ్రీనివాస్ పచ్చిమడ్ల పరశురాం గుడాల శీను పెద్ద ఎత్తున బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు

## మున్సిపల్ ఎన్నికల ప్రచారం బీజేపీ అభ్యర్థి గిరి ప్రసాద్



**పరకాల,నేటిధాత్రి:** పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 21వ వార్డు అభ్యర్థి బండారి గిరి ప్రసాద్ కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ నీరు,మురుగు కాలువల నిర్వహణకు శాశ్వత పరిష్కారం,మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ ఎన్నికలలో బీజేపీ పార్టీకి భారీ మెజారిటీతో విజయం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వారు ఇంటింటా తిరుగుతూ ప్రజలతో ఓటును అభ్యర్థించారు. వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మున్సిపాలిటీపై బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం



▶▶మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

**భూపాలపల్లి, నేటిధాత్రి:** బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ హాజరైనారు అనంతరం మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ 30 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల లిస్టును ప్రకటించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల్లో రెబల్స్ లేకుండా అభ్యర్థులను ప్రకటించడం జరిగింది కావున భూపాలపల్లి మున్సిపాలిటీపై బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాను చేశారు అలాగే జిల్లాకు మెడికల్ కాలేజీ కలెక్టరేట్ ఎస్పీ కార్యాలయం ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశారు భూపాలపల్లి మున్సిపాలిటీ ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేస్తున్నాను అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో 30 వార్డులకు సంబంధించిన కౌన్సిలర్ అభ్యర్థులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ప్రజలనుండి విశేష ఆదరణ

▶▶3వ వార్డు అభ్యర్థి పంచగిరి సృజన



**పరకాల, నేటిధాత్రి:** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 3వ వార్డులో బిఆర్ఎస్ ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ,వార్డు సమస్యలపై నేరుగా స్పందిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి సృజన కు ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోంది.మంగళవారం పరకాల పట్టణంలోని పద్మశాలి వాడ,గడ్డం వాడ, ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ కాలనీలోని తాగునీరు,డ్రైనేజీ,రోడ్లు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో,ప్రజల ఆశీర్వాదం కోరుకుంటూ మీ ముందుకు వచ్చానని తెలిపారు. మీరు ఆశీర్వదిస్తే 3వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పంచగిరి సుధాకర్,ఆలేటి మహేందర్, వార్డు ఇంచార్జి రవీందర్, నాయకులు విష్ణు,అనిల్, ఉమర్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్లో ఘోరం.. కడుపులో దిగిన చువ్వలు..



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్లోని ఆదర్శనగర్లో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి రాజు (50) అనే కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదవశాత్తు కింద పడటంతో ఇనుప చువ్వలు కడుపులోకి గుచ్చుకున్నాయి. రంజోల్కు చెందిన రాజును 108 సిబ్బంది చాకచక్యంగా రక్షించారు. చువ్వలను కత్తిరించి, ప్రథమ చికిత్స అందిస్తూ జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించిన ఈఎంటీ సంగమేశ్వర్, పైలట్ శ్రీనివాస్ను స్థానికులు అభినందించారు.

## బారాస కౌన్సిలర్ అభ్యర్థిని విత్ డ్రా చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు బెదిరింపు

▶▶బారాస నాయకులు రాజా రమేష్



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16 వ వార్డ్ బారాస కౌన్సిలర్ అభ్యర్థి గండమాల కృపానందం (గ్యాస్ నాని) ని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కిడ్నాప్ చేసి,బలవంతంగా విత్ డ్రా చేసుకోవాలని భయభ్రాంతులకు గురిచేసి మున్సిపాలిటీ కార్యాలయంలోని ఎన్నికల కేంద్రానికి విత్ డ్రా సమయం అయిపోయిన గంట తర్వాత తీసుకుని రావడంతో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఎన్నికల అధికారులు సమయం దాటి పోయిందని అనుమతించలేదు. ఆ అభ్యర్థి కంట నీరు పెడుతూ గజగజ వనికి పోతుండగా గమనించిన బిఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ నాయకులు రాజా రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సిపిఐ జిల్లా అధ్యక్షుడు రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి శ్రీనివాస్, ఇరు పార్టీల నాయకులు అభ్యర్థిని ఏం జరిగిందంటూ తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు ను మా పార్టీ బీ ఫామ్ ఇచ్చిన అభ్యర్థిని బెదిరించి ఎన్నికల కేంద్రానికి విత్ డ్రా చేసుకోవాలని తీసుకురావడం ఏంటని నిలదీశారు. అప్పటికే అభ్యర్థిని దబాయిస్తూ నిన్ను మేము బెదిరించామా అంటూ అభ్యర్థిని గద్దించాడు. అభ్యర్థి గ్యాస్ నాని వనికిపోతూ సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉండిపోయారు. బారాస నాయకులు, అధికార పార్టీ నాయకులను అభ్యర్థిని భయభ్రాంతులకు గురి చేసి తీసుకురావడం ఏంటని ప్రశ్నించడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అక్కడే ఉన్న స్థానిక ఎస్సై జె శ్రీధర్ గొడవ జరిగేలా ఉందని గమనించి అందర్ని కార్యాలయం బయటికి పంపించి వేశారు.

## నర్సంపేట బిఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల

▶▶బిఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి సహకరించాలి

▶▶నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నర్సంపేట, నేటిధాత్రి:** రాష్ట్రంలో రాబోయేది టీఆర్ఎస్ ప్రభుత్వమే అని, రాబోయే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలలో పోటీ చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం నర్సంపేట పట్టణ ప్రజలు కార్యకర్తలు నాయకులు సహకరించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలలో 30 వార్డులలో బరిలోకి దింపిన ఆ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాను పెద్ది సుదర్శన్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం సుదీర్ఘంగా ఆలోచించి అన్ని సామాజిక వర్గాలతో కూడిన బలమైన కౌన్సిలర్ అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఎన్నికలలో తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ అభ్యర్థుల ఎంపికకు సహకరించిన పార్టీ నాయకులకు ,పార్టీ శ్రేణులకు ,కార్యకర్తలకు నా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల పట్ల ఆశావాహులకు భవిష్యత్తులో పార్టీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

▶▶**30 వార్డులల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల వివరాలు..** 1 వ వార్డు కదారీ కవిత కుమారస్వామి,2 వ వార్డు గోలి అనిత శ్రీనివాస్ రెడ్డి,3 వ వార్డు మండల కుమారస్వామి,4వ వార్డు బీరం నాగిరెడ్డి,5 వ వార్డు బొడుగు సంధ్యారాణి శ్రీనివాస్,6వ వార్డు వేణుముద్దల శ్రీధర్ రెడ్డి,7 వ వార్డు మోతే తిరుపతిరెడ్డి,8 వ వార్డు పెండెం కళ్యాణి వెంకటేశ్వర్లు,9 వ వార్డు రాయుడి కీర్తి దుష్యంత్ రెడ్డి,10 వ వార్డు నాగిశెట్టి పద్మ ప్రసాద్,11 వ వార్డు పెండ్యాల జ్యోతి ప్రభాకర్,12 వ వార్డు ఇస్లావత్ రజిత రాజన్న నాయక్,13 వ వార్డు అంగోత్ సుధాకర్ లాల్,14 వ వార్డు బుస శిరీష రాజు,15వ వార్డు మీరాల ఐలయ్య యాదవ్,16 వ వార్డు బానోతు నవీన్ నాయక్,17 వ వార్డు నల్లా మనోహర్ రెడ్డి,18 వ వార్డు దొమ్మటి రమ్య సంతోష్ గౌడ్,19 వ వార్డు గాలి శ్రీనివాస్ యాదవ్,20 వ వార్డు వాసం కరుణ - సాంబయ్య,21 వ వార్డు శివరాత్రి స్వామి,22 వ వార్డు మాదాసి ప్రవీణ్,23 వ వార్డు మంద రిషిత ప్రసాద్,24 వ వార్డు పెండెం శివానంద్,25 వ వార్డు నాడెం సునీత శాంతి కుమార్,26 వ వార్డు మండల శ్రీదేవి శ్రీనివాస్,27 వ వార్డు గిరగాని హైమావతి సాంబయ్య గౌడ్,28 వ వార్డు చింతల రేఖా టార్జాన్,29 నాగెల్లి పద్మ వెంకటనారాయణ గౌడ్,30 వ వార్డు బండి ప్రవీణ్ కుమార్.


## భద్రకాళి ఆలయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి ప్రత్యేక పూజలు.



**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని ఏపీ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజ్నెవా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ భద్రకాళి అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం గర్భగుడిలో శ్రీ భద్రకాళి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. పూజానంతరం ఆలయ మండపంలో ముఖ్య అర్చకులు, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మ మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములను అన్నా లెజ్నెవాకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

▶▶ఏఐఎంఐఎం పార్టీ మండల అధ్యక్షులు షేక్ రబ్బానీ



**జహీరాబాద్, నేటిధాత్రి:** మహాశివరాత్రి జాతర కోసం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఝరాసంగం మండల ఏఐఎంఐఎం పార్టీ అధ్యక్షులు షేక్ రబ్బానీ అన్నారు. ఈ నెల 15, 16, 17వ తేదీల్లో శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై ఝరాసంగం మండల ఏఐఎంఐఎం పార్టీ అధ్యక్షులు షేక్ రబ్బానీ మాట్లాడుతూ ఉత్సవాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పకడ్బందీగా. మహాశివరాత్రి జాతరను పండుగగా భావించి భక్తులు సులభంగా, వేగంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. శివ స్వాములకు సులభ దర్శనం జరిగే విధంగా చూడాలని, దర్శన సమయం కూడా అరగంట అదనంగా పెంచాలన్నారు. పుర ప్రముఖులకు గతంలో మాదిరి అందజేసి సులభ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలాని. ప్రస్తుతం భక్తుల కోసం రెండు క్యూలైన్‌ల సిస్టం ఉన్న దృష్ట్యా వీఐపీల కోసం మూడో క్యూలైన్ శివరాత్రి లోగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ ప్రాంగణం వద్ద భక్తులకు తాగునీరు, కుర్చీలు, పందిల్ల సౌకర్యం కల్పించాలని. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. బస్టాండ్ లో మూత్రశాలలు, తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని. కంట్రోల్ రూమ్‌ల వద్ద ప్రజా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి మైకు ద్వారా భక్తులకు తెలియజేసే సౌకర్యం కల్పించాలన్నారు.జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు శాశ్వత సీసీ కెమెరాలను పెట్టాలన్నారు. జాతర విజయవంతం చేసేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సూక్ష్మస్థాయి ప్రణాళికలు రూపొందించాలన్నారు. జాతరలో ఆధ్యాత్మికత, భక్తిభావం ఉట్టిపడేలా భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని. భక్తులు స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని కోరారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి జాతర సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వలంటీర్‌లను ఏర్పాటు చేయాలని. అగ్ని మాపక అధికారులు ఆలయ సిబ్బందికి అగ్ని మాపక పరికరాలు వాడే విధానంపై ముందస్తు అవగాహన కల్పించాలని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్య కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మూడు రోజులు తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని నీటి సరఫరా. అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా నిరంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని.మెరుగైన పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని అన్నారు, అమృత గుండం దగ్గర కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ నుంచి దర్శనానికి వచ్చిన భక్తులను స్నానాలు చేసి బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలన్నారు,

▶▶ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి.......ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఝరాసంగం మండల ఏఐఎంఐఎం పార్టీ అధ్యక్షులు షేక్ రబ్బానీ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఝరాసంగం మండల ఆయా గ్రామీణ ప్రాంతాలు, సైతం అవసరమైన ఏర్పాట్ల కోసం మసీదుల వద్ద విద్యుత్ దీపాలు ఎక్కడైనా, అప్రోచ్ రోడ్డు గుంతల మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. మసీదుల వద్ద హైమాస్ లైట్, వీధి దీపాల పని తీరు పర్యవేక్షించాలని, మసీదుల వద్ద పారిశుద్ధ్య మురికి కాలువలు నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. మండల అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని పంచాయతి అధికారులను కోరారు. సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. రంజాన్ మాసంలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర వ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యుత్తు అధికారులకు సూచించారు. ఏదేని విద్యుత్తు సమస్య వచ్చినా తక్షణమే స్పందించేందుకు మసీదు పెద్దలకు ఆ ప్రాంతం యొక్క లైన్ మెన్ ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచాలని అన్నారు,ఇషా నమాజ్ తర్వాత రాత్రి సమయంలో జరిగే ప్రత్యేక ప్రార్థనలు.సహర్ (గావప్రతీఅ):హొసూర్యోదయానికి ముందు వేకువజామున చేసే భోజనం. ఈ సమయంలో విద్యుత్ శాఖ అధికారులకు రంజాన్ సమయాలను తెలియజేసి, ఆ సమయంలో పవర్ కట్స్ చేయకుండా చూడాలని ముందస్తుగా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మండల ఆయా గ్రామాలలో వంటి ప్రాంతాలలో ఇబ్బందులను నివారించాలని కోరారు.

# వేతన బకాయిలు డిమాండ్ చేస్తూ ట్రైడెంట్ కార్మికుల ఆందోళన



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్: వేతన బకాయిలు చెల్లించాలన్న ప్రధాన డిమాండ్తో కార్మిక సంఘం అధ్యక్షులు ఎంజీ.రాముల ఆధ్వర్యంలో ట్రైడెంట్ కార్మికులు కంపెనీ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా యాజమాన్యం తమ బకాయి డబ్బులను చెల్లించకుండా రేపు మాపంటూ కాలయాపన చేస్తోందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. కంపెనీ కార్మికులు కాదని యూపీ, బీహార్ కు చెందిన దినసరి కూలీలతో చట్టవిరుద్ధంగా పని చేయిస్తున్నారన్నారు. రూ.5 కోట్లు వేతన బకాయిలు చెల్లించి తమకు పనులు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కంపెనీ, కార్మిక చట్టాలకు విరుద్ధంగా యూపీ, బీహార్లకు చెందిన 300 మంది కార్మికులతో పనిచేయిస్తున్నారని ఆరోపించారు. వీరిలో చాలామంది కూలీలు బాల కార్మికులేనని పేర్కొన్నారు.ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి పని కల్పిస్తూ తమకు మాత్రం బకాయిలు చెల్లించకుండా పని కల్పించకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం దిగొచ్చేంత వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల డీసీఎల్ వద్ద సమావేశమైన యాజమాన్యాలు ఉమర్, ఓంకార్ షుగర్స్ లతో ఫిబ్రవరి 2వ తేదీ వరకు బకాయిలు చెల్లించేలా జరిగిన ఒప్పందం ప్రకారం ఈరోజు చెల్లించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా యాజమాన్యం వ్యవహరించడంతో ఆగ్రహించిన కార్మికులు కంపెనీ గేటు ముందు బైఠాయించారు. తమ డిమాండ్లు పరిష్కరించే అంతవరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మిక సంఘం అధ్యక్షులు ఎంజీ.రాములతో పాటు నాయకులు రాజశేఖర్, నాగేష్ పాటిల్, జగదీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాల్కల్ లో ఉర్సు: గంధం ఊరేగింపుతో ఆధ్యాత్మిక వాతావరణం



**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల కేంద్రంలో ఉర్సు సందర్భంగా సోమవారం రాత్రి గంధం ఊరేగింపు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దర్గా ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపులో అలంకరించిన గుర్రం, డప్పుల మోగుడు, భక్తుల నినాదాలతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. గంధపు సువాసన, దువాలు, సలాం మధ్య ఊరేగింపు ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఊరేగింపును తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఉర్సు సందర్భంగా దర్గా పరిసరాలను విద్యుత్ దీపాలు, పతాకాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయగా, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# 23 నామినేషన్ల ఉపసంహరణ




**మేడ్చల్, నేటిధాత్రి:** ఎల్లంపేట మున్సిపాలిటీలో నామినేషన్ల ఉపసంహరణ మొదటిరోజు అయిన సోమవారం 12 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇందులో బిఆర్ఎస్ కు చెందిన ఏడు మంది, కాంగ్రెస్కు చెందిన ముగ్గురు, బీజేపీకి చెందిన ఒకరి తో పాటు స్వతంత్ర అభ్యర్థి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఆలియా బాద్ లో బిఆర్ ఎస్ కు చెందిన ఒకరు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. కాగా మూడ్చింతలపల్లి మున్సిపాలిటీలో పదిమంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అందులో బిజెపికి చెందిన ఇద్దరు, కాంగ్రెస్కు చెందిన నలుగురు, బిఆర్ఎస్ కు చెందిన ఒకరు, ఒకటి జనసేన ఒకరు జనకు జనసేనకు చెందిన ఒకరు, స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు తమ నామినేషన్ను ఉపసంహరించుకున్నారు.

# పని చేసే వారిని గెలిపించండి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

▶▶అలియాబాద్ 7వ వార్డులో ఎన్నికల ప్రచారం



**మేడ్చల్, నేటిధాత్రి:** ప్రజల కోసం పనిచేసే పార్టీ బలపరిచిన అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని 7వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తంటం నర్సింహా తరపున ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ, మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్లుబాయి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు నర్సింగరావు, కుమార్, సంజీవరెడ్డి, వెంకటరెడ్డి బాబు, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి




**జహీరాబాద్, నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం మామిడిగి సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ట్రక్కు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో వడ్డీ గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ కమల (40), భోజ్యానాయక్ తండాకు చెందిన అంబ్యానాయక్ (55) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని జహీరాబాద్, బీదర్ ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రహదారులపై అతివేగం, ముఖ్యంగా మూలమలుపుల వద్ద అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# ఏజెన్సీలో డిఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్ ఆకస్మిక పర్యటన



▶▶జ్వర బాధితులను నిర్లక్ష్యం చేయవద్దు

▶▶నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలి



**చర్ల, నేటిధాత్రి:** చర్ల మండల కేంద్రంలో సోమవారం భద్రాద్రి జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరు సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ప్రజలకు మెరుగైన వైద్యం ఎలా అందుతుందో పరిశీలన చేశారు ఎక్కడైతే జ్వరాలు నమోదు అవుతున్నాయో ఆ గ్రామంలో ప్రతిరోజు ఇంటింటికి సర్వే నిర్వహించి జ్వర నమోదు చేయాలి అనితెలిపారు ఆ గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించాలి అన్నారు ఆ గ్రామంలోఅన్ని గృహాలు సందర్శించాలిఫ్రైడే డ్రై డే నిర్వహించాలి అన్ని జ్వరాలకు రక్త నమూన తప్పక సేకరించి పరీక్షకు పంపించాలి అన్నారు ప్రతి ఫీవర్ కేసు ని తగ్గేంత వరకు ఫాలో అప్ చెయ్యాలి అని చెప్పారు ఆశ కార్యకర్తలు ఫ్రైడే డ్రై డే తప్పకుండా ఫార్మెట్ ప్రకారం చేయాలని తెలియజేయటం జరిగినది ఫీవర్ కేసు విషయం నిర్లక్ష్యం చేసినచో సిబ్బందిపై చర్యలు తీసుకోవటం జరుగుతుంది అని తెలియజేశారు గర్భవతులను నార్మల్ డెలివరీ కి ఏ విధంగా ప్రోత్సహించాలో తెలియజేశారు అనంతరం చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సందర్శించి తగు సూచనలు ఇవ్వటం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ శ్రీధర్ సత్యనారాయణపురం వైద్యాధికారి డాక్టర్ దివ్య నయన మొబైల్ డాక్టర్ సచిన్ హోమియో డాక్టర్ పూజ డిపిఎంఓ మోహన్ సబ్ యూనిట్ ఆఫీసర్ ధర్మారావు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# దాట్ల విజయ శ్రీనివాసుని గెలిపించండి



▶▶ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 16 వ వార్డు సిపిఐ సిపిఎం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి దాట్ల విజయ శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి దాట్ల విజయ శ్రీనివాసుకు మీ అమూల్యమైన ఓటు చేతి గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించగలరు అని వారు అన్నారు కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు

▶▶రిటర్నింగ్ అధికారులకు బిఫారంలు అందజేత



**మేడ్చల్, నేటిధాత్రి:** మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ మాజీ అధ్యక్షుడు టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అభ్యర్థులతో కలసి అధికారికంగా బి--ఫారంలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు చింతలపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన ఉందని, అభివృద్ధి సంక్షేమమే తమ లక్ష్యమని తెలిపారు. పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రజల మధ్యకు వెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ నరసింహులు యాదవ్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ తోటకూర అజయ్ యాదవ్, అమర్ సింగ్, మాజీవైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి కొక్కిరాల దీప్తి ప్రచారం



**పరకాల,నేటిధాత్రి:** పట్టణంలోని 14వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి కొక్కిరాల దీప్తి రాకేష్ రావు ప్రచారం జోరుగా కొనసాగుతోంది.మంగళవారం గంద్రవాడ, బ్రాహ్మణవాడ ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ఆమె ఓటర్లను కలిసిన సందర్భంగా తనకు అవకాశం ఇస్తే కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరిస్తానని వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే బ్రాహ్మణవాడలో పర్యటించిన సమయంలో బిడ్డా..మా ఓటు నీకే"అంటూ ఆశీర్వదించడంతో ప్రచారానికి మరింత ఉత్సాహం లభించింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఎండీ జాకీర్ అలీ (ఎంపీపీ) నాయకులు పాడి నవతా భగవాన్ రెడ్డి,బండి వెంకటేష్,ఎండీ మాక్స్ ద్ అలీ,ఎండీ బియా బాని,జాలా రవీందర్ రెడ్డి,బొమ్మకంటి నాగరాజు,మంజూరు,ఖలీమ్,మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# నాయక్ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత



**చిట్యాల, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని చిట్యాల మండలలోని అందుకుతండా గ్రామంలో బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఆదేశాల మేరకు. కి,,శే బానోతు మంగ్తే నాయక్(గుండు) మరణించడం జరిగింది. వారి కుటుంబానికి 6వ వార్డు మెంబెర్ పుల్లల పద్మ-సదయ్యలి 50 కిలో ల సన్న బియ్యం నిత్యావసరాలు వస్తువులు వారి వంతుగా సహకారం అందిచడం జరిగింది ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ లిగ్రామ అధ్యక్షులు దాసరి తిరుపతి వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా మోహన్ సీనియర్ నాయకులు బానోత్ రాజు దాసారపు దేవదాస్ లావుడ్యా రాకేష్ పాల్గొన్నారు.

# ఈ నెల 8న సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన

▶▶ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** సీఎం రేవంత్ రెడ్డి గా భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా కొడవటంచ ఆలయాన్ని సందర్శించి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించనున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ కొడవటంచ ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులు, హెలిప్యాడ్ రోడ్డు ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం భూపాలపల్లి పట్టణంలోని మంజూరు నగర్‌లో ఏర్పాటు చేయనున్న సభా ప్రాంగణ స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# పని ప్రదేశాలలో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసే వారిపై చట్టపరమైన చర్యలు

**జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్**



**మంచిర్యాల,నేటిధాత్రి:**ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు,పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధించే వారిపై పోష్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.మహిళలు లైంగిక వేధింపుల నిరోధక చట్టం పాస్ - 2013 పై అవగాహన కలిగి ఉండాలని,పని ప్రదేశాలలో మహిళలకు భద్రత,గౌరవం, సమానత్వం కల్పించడమే లక్ష్యంగా చట్టం రూపొందించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ,ప్రైవేట్ పరిశ్రమలలో,వాణిజ్య, వ్యాపార సముదాయాలలో, షాపింగ్ మాల్స్,జిన్నింగ్ మిల్లులు,ఇతర పని ప్రదేశాలలో పని చేసే మహిళలు లైంగిక వేధింపులకు గురైతే బాధిత మహిళలు నిర్భయంగా అంతర్గత ఫిర్యాదు కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని,పోష్ చట్టం 2013 ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు.ఫిర్యాదు పై కమిటీ నిర్ణీత కాలంలో విచారణ పూర్తి చేసి తగు చర్యలు తీసుకుంటుందని, అవసరమైతే పోలీస్ కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రతి కార్యాలయంలో,పని ప్రదేశాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని,మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు.మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా విస్తృతస్థాయిలో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.పోష్ చట్టం,అంతర్గత ఫిర్యాదు కమిటీ ఉద్దేశం,హక్కులు, ఫిర్యాదు విధానం,కమిటీ నిర్మాణం,బాధ్యతలు వంటి అంశాలపై అధికారులు, ఉద్యోగులకు స్పష్టమైన అవగాహన కల్పించడం జరుగుతుందని,కమిటీ వివరాలను నిర్దిష్ట ఫారం ద్వారా సేకరించి సంబంధిత సమాచారాన్ని షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఇప్పటివరకు 47 అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని,వీటిలో ప్రభుత్వ జిల్లా స్థాయి కార్యాలయాలలో 30 కమిటీలు,ఉప జిల్లాస్థాయి కార్యాలయాలలో 16, ప్రైవేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్, దుకాణాలలో 1 కమిటీ పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ సంస్థలు తమ సంస్థలలో కమిటీలను ఏర్పాటు చేయాలని,జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం, షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు.పోష్ చట్టం అమలుతో మహిళలకు పని ప్రదేశాలు సురక్షితంగా మారుతాయని,ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని తెలిపారు.

# కుసుమ కుమారికి పీహెచ్.డీ

**పఠాన్‌చేరు,నేటిధాత్రి:**హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆర్గనైజేషనల్ డెవలప్ మెంట్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ (ఓడీ అండ్ హెచ్ఆర్) విభాగం పరిశోధక విద్యార్థిని సీహెచ్.వీ.ఎల్.ఎల్. కుసుమ కుమారి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'విశాఖపట్నంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఉద్యోగుల పని-జీవిత సమతుల్యత'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఓడీ అండ్ హెచ్ఆర్) విభాగం పూర్వ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సుమన్ బాబు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ కుసుమ కుమారి అధ్యయనం, సంస్థాగత పరిస్థితులు, జనాభా అంశాలు, రిమోట్ వర్క్ వంటి అభివృద్ధి చెందుతున్న పని పద్ధతుల ద్వారా ప్రభావితమైన విస్తృతమైన నిర్మాణంగా పని-జీవిత సమతుల్యతను పరిశీలిస్తుందని తెలిపారు. పది కంపెనీలలోని 372 మంది ఐటీ నిపుణుల నుంచి సేకరించిన డేటా ఆధారంగా, ఉద్యోగ సంతృప్తి, ఉత్పాదకతపై పని-జీవిత సమతుల్యత ప్రభావాన్ని నిర్ధారించడానికి బలమైన గణాంక సాధనాలను ఉపయోగించినట్టు వివరించారు. ఈ పరిశోధన ఫలితాలు ఐటీ సంస్థలకు మానసిక శ్రేయస్సు, సుస్థిరమైన పని పద్ధతులు సంస్థాగత సామర్థ్యాన్ని ప్రోత్సహించే ఉద్యోగి-కేంద్రీకృత విధానాలను రూపొందించడంలో సహాయపడతాయని భావిస్తున్నామన్నారు.డాక్టర్ కుసుమ కుమారి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి

**డి ఎం హెచ్ ఓ అనిత**



**జైపూర్,నేటిధాత్రి:**ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో,గ్రామీణ ప్రజల ప్రాణాలను కాపాడడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా వైద్యాధికారి ఎస్.అనిత అన్నారు.మంగళవారం ఆశా డే సందర్భంగా ఆమె జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.మాతా శిశు సంరక్షణ,టీకాల కార్యక్రమాలు,వ్యాధి నివారణ,ఇంటింటి ఫీవర్ సర్వే వివిధ అంశాలపై డాక్టర్ ముస్తఫా తో కలిసి ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు.100% గర్భిణీల నమోదు,టీకాలు ఇవ్వడం, మందుల నిలువలు,తదితర అంశాలను సమీక్షించారు.అనంతరం కేజీబివి పాఠశాలను సందర్శించి,విద్యార్థులు ఒత్తిడిని జయించేందుకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.రోజువారి దినచర్యలో యోగా, మెడిటేషన్,శారీరక వ్యాయామం పాటించి శరీరాన్ని దృఢంగా మార్చుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

# క్యాన్సర్ పట్ల అవగాహన ఎంతో అవసరంలి

**వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్ .**



**వరంగల్, నేటిధాత్రి:**ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లోని క్యాన్సర్ చికిత్స వార్డులో వ్యాధిగ్రస్తులకు పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్ మాట్లాడుతూ "క్యాన్సర్ పట్ల సరైన అవగాహన లేక క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. వివిధ రకాల క్యాన్సర్ లక్షణాలను ముందే గుర్తించగలిగి, డాక్టర్ సలహాలు తీసుకొని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. క్యాన్సర్ ను ముందే గ్రహిస్తే చికిత్స సులభతరం అవుతుందని తెలిపారు. క్యాన్సర్ మహమ్మారి నుండి కోలుకున్న వారిని ఉదాహరణగా తీసుకొని ధైర్యంగా ఉండాలని తెలిపారు. క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండి, సరైన నియమ నిబంధనలు పాటిస్తే క్యాన్సర్ ను ఎదుర్కొనవచ్చును అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.జి.యం. ఆర్.యం.ఓ.డాక్టర్ మహేందర్, డా.భాస్కర్ (అంకాలజిస్ట్), పారా లీగల్ వాలంటీర్ వై.సింధూజ, ఏ.యన్.యం.లు తదితరులు పాల్గొన్నారు.

# ముదిగుంట లో ఉపాధి హామీ ప్రారంభం



**జైపూర్,నేటిధాత్రి:**జైపూర్ మండలంలోని ముదిగుంట గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి.సర్పంచ్ ఆకుల రవి కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సత్యనారాయణ పని స్థలాన్ని సందర్శించి నీటి నిల్వలను పెంపొందించడం కోసం తీసే కాలువలను త్రవ్వే పనులను ఉపాధి హామీ పథకం క్రింద ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కూలీలతో చర్చ గోష్టి జరిపి, రోజువారి కూలి 307 రూపాయలు వచ్చుటకు త్రవ్వవలసిన ప్రభుత్వ నిర్దేశిత కొలతలను గురించి,పనిచేస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ,ఏపీవో,టెక్నికల్ అసిస్టెంట్,పంచాయతి కార్యదర్శి,ఫీల్డ్ అసిస్టెంట్,సర్పంచ్ రవికుమార్,ఉప సర్పంచ్ సంధ్యారాణి,వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజాసాక్షి దిన పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్ శ్రీనివాస్

**ప్రభుత్వ వైద్యురాలు వాహిని**



**మల్లాపూర్,నేటిధాత్రి:**వార్తా పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలాగ పని చేస్తాయని మండల తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసాక్షి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించి అభినంధనలు తెలియజేసారు. మండల ప్రభుత్వ వైద్యురాలు వాహిని మాట్లాడుతూ తన ద్వార ప్రజాసాక్షి క్యాలెండర్ ఆవిష్కరించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ , ప్రభుత్వ వైద్యురాలు వాహిని, సూపర్ వైజర్ రాంమోహన్ ,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ , నర్సింగ్ ఆఫీసర్ ఉమాదేవి, వార్త దినపత్రిక ప్రతినిధి రాంప్రసాద్ , నేటి ధాత్రి దినపత్రిక ప్రతినిధి ఎస్ పి రమణ, అక్షర వేధం దిన పత్రిక ప్రతినిధి జరుపుల రమేష్ , కాంగ్రెస్ నాయకులు గంధం రాజేష్ , ప్రజాసాక్షి దినపత్రిక ప్రతినిధి వంగ రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం

**దాడులు, అక్రమ కేసులు పెరిగాయి**

**పార్లమెంట్ ఆవరణలో వైకాపా ఏంపీల నిరసన**

**రాష్ట్రపతి పాలన విధించాలని ఏంపీల డిమాండ్**

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:** కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎసఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని వెరసి శాంతి భద్రతలు విఫలమయ్యాయని వైఎసఆర్‌సీపీ ఎంపీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పార్లమెంటు ఆవరణంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఏపీలో కూటమి ఆటవిక పాలనను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఎదుట ధర్నా చేపట్టింది. మంగళవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎంపీలు ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. ఏపీ శాంతి భద్రతల వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని.. అవసరమైతే రాష్ట్రపతి పాలన విధించాలని నినాదాలు చేశారు. ఇళ్లు, కార్లు తగులబెట్టడం, తప్పుడు కేసులు నమోదు చేసి వేధించడం వంటి దుశ్చర్యలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగ పాలనకు బదులు సొంతంగా రూపొందించుకున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'ను అమలు చేస్తున్నట్లుగా పరిస్థితి మారిందని, దీనివల్ల ప్రజలకు, ప్రతిపక్షాలకు న్యాయం పూర్తిగా దూరమైందని తీవ్రంగా విమర్శించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజిని ఇళ్లపై జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఇవి కూటమి ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలకు స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, పోలీసులు నిస్సహాయ స్థితిలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితిపై ప్రధాని, కేంద్ర హోం మంత్రి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిన బాధ్యత తీసుకోవాలని వైఎసఆర్‌సీపీ ఎంపీలు డిమాండ్ చేశారు.ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోంది. ప్రతిపక్ష నేతల ఇళ్లపై దాడులు పరిపాటిగా మారాయి. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి. శాంతి భద్రతలను పరిరక్షించాలి. రాష్ట్రపతి పాలన విధించాలి అని వైఎస్సార్‌సీపీ ఎంపీలు కేంద్రాన్ని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతీకార రాజకీయాలు మొదలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని.. అక్రమ కేసులు, అరెస్టులు చేయించడమే కాదు.. హత్యలకూ పాల్పడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ సోషల్ విడియాలో పోస్టులు పెట్టినా వదలడం లేదు. ఈ క్రమంలోనే.. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాసాలపై అధికార టీడీపీ దాడులు చేసింది. ఈ జంగిల్ రాజ్‌పై చట్టబద్ధంగా, అహింసా పద్ధతుల్లో వైస్సార్‌సీపీ పోరాటాన్ని ప్రారంభించింది. ఇప్పటికే ఈ పరిస్థితులను కేంద్ర హోం శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది వైఎస్సార్‌సీపీ. త్వరలో హోంమంత్రి అమిత్ షాను కలసి పరిస్థితులను ఆయనకు వివరించాలని భావిస్తోంది.

# చంద్రగిరిలో ఇద్దరూ గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

**రూ. 6,60,000 విలువ చేసే 22 కేజీల గంజాయి స్వాధీనం**



**చంద్రగిరి,నేటిధాత్రి:**చంద్రగిరి మండల పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం చంద్రగిరి పోలీస్ స్టేషన్ లోస్మగ్లర్ల అరెస్టు పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఏ ఎస్ పి రవి మనోహరాచారి పర్యవేక్షణలో డి.ఎస్.పి బి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రత్యేక పోలీసు బృందాలు పనిచేస్తున్నాయన్నారు. డీఎస్పీ బి ప్రసాద్ కు గంజాయి అక్రమ రవాణా పై వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం తొండవాడ జాతీయ రహదారి వంతెన వద్ద సీఐ సురేష్ కుమార్ నేతృత్వంలో ఎస్సైలు అరుణాచలం, రవి ప్రకాష్ రెడ్డి, సిబ్బంది తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదమైన రెండు బ్యాగులు కలిగిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా



పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేయగా ఆరు ప్యాకెట్లు లో 22 కేజీల గంజాయి పట్టుకున్నారు. స్థానిక తహశీల్దార్ శివరాం సుబ్బయ్య సమక్షంలో పంచనామా చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని విచారించగా చంద్రగిరి మండలం పిచ్చినాయుడు పల్లి గ్రామానికి చెందిన శశి కుమార్, చంద్రగిరి టౌన్ అక్క గార్ల కాలనీకి చెందిన షేక్ లాల్ గా గుర్తించారు. పోలీసులు నిందితులను విచారించగా వైజాగ్ నుండి తెలిసిన వ్యక్తి ద్వారా తెప్పించుకుని చంద్రగిరి పరిసర ప్రాంతాలలో అమ్మాలనుకున్నట్లు తెలిందింది. నిందితులు గంజాయి వినియోగించే వారి పేర్లను, గంజాయి విక్రయిస్తున్న వారి పేర్లను కూడా తెలిపినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాలో ఈ ఇద్దరితోపాటు మరికొందరి పాత్ర ఉందని పోలీసులు గుర్తించినట్లు పేర్కొన్నారు. త్వరలో ఆ పాత్రధారులను కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. కేసు నమోదు చేసి ముద్దాలను తిరుపతి కోర్టుకు హాజరు హాజరు పరిచినట్టు సురేష్ కుమార్ తెలిపారు. న్యాయస్థానం ముద్దాయిలకు 14 రోజులు రిమాండ్ విధించింది అన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రతిభ కనబరిచిన చంద్రగిరి స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎమ్. సురేష్ కుమార్, యస్.ఐలు రవిప్రకాష్ రెడ్డి, అరుణాచలం సిబ్బంది ఎమ్ నాగరాజు, శ్రీనివాసులు, చలపతి, రాజశేఖర్, మణి, మణిప్రసాద్ మహేష్ లకు క్యాష్ రివార్డ్ లను ప్రకటించినట్లు సిఐ సురేష్ కుమార్ తెలిపారు

# ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

**గెలిచి వస్తేనే రాజకీయ భవిష్యత్...**

**30 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల వివరాలు ప్రకటన**

**నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలి**



**నర్సంపేట,నేటిధాత్రి:**నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు.ఎన్నికల్లో గెలిచిన వారికే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 30 వార్డులలో పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లను మంగళవారం ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల పోటీలో గెలుపొంది రావాలని దానికోసం వార్డు పరిధిలోని నాయకులు కార్యకర్తలు వార్డు ఇన్చార్జిలు కృషి చేయవలసి ఉంటుందని వివరించారు.నర్సంపేట కాంగ్రెస్ పార్టీ నుండి మున్సిపాలిటీకి పోటీ చేస్తున్న 30 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించారు.30 వార్డులలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు వీరే..1వ వార్డు నుండి మేఘన కొత్తకొండ,2వ వార్డు కంపెల్లి వీణ, 3వ వార్డు నుండి ముత్తినేని వెంకన్న, 4వ వార్డు నుండి బీరం భరత్,5వ వార్డు పొన్నాల మనిషా, 6వ వార్డు నుండి పున్నం నర్సింహారెడ్డి,7వ వార్డు నుండి గంధం నరేందర్,8వ వార్డు నుండి కందుకూరి రజిత,9వ వార్డు అభ్యర్థిగా బండి పల్లవి, 10వ వార్డు నుండి చింతల సాంబరెడ్డి,11 వార్డు నుండి స్వరూప చీకటి,12 వ వార్డు నుండి ఇస్లావత్ రమ,13వ వార్డు నుండి భూక్య మాతృ రాథోడ్,14వ వార్డు నుండి గుజ్జుల భవాని,15వ వార్డు నుండి ఏపూరి శ్రీనివాసరెడ్డి,16వ వార్డు నుండి అజ్మీరా మేఘ్య,17వ వార్డు నుండి సల్లావుద్దీన్ అయోబ్ ఖాన్, 18 వ వార్డు నుండి లక్కర్స్ రజిత,19 వార్డు నుండి ఎలికంటి విజయ్ కుమార్,20 వార్డు నుండి శ్రీరామోజు రోజారాణి, 21 వ వార్డు నుండి అంజలి ఓర్సు,22వ వార్డు నుండి బాణాల ప్రసన్నకుమారి, 23వ వార్డు నుండి వేల్పుల శ్రీలత, 24 వార్డు నుండి బత్తిని రాజేందర్ , 25 వార్డు నుండి పెండెం శ్రీలక్ష్మి, 26వ వార్డు నుండి గాజుల విమల,27వ వార్డు నుండి ములకల వినోద ,28వ వార్డు నుండి చిలువేరు రజిని భారతి , 29వ వార్డు నుండి వేముల సంధ్య,30వ వార్డు నుండి మాదాసి రవిలకు బీఫార్మ్స్ ఇచ్చి పోటీ బరిలో ఉన్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రకటించారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్,సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి,తోకల శ్రీనివాసరెడ్డి, ఎర్ర యాకూబ్ రెడ్డి,ప్రభాకర్,రాజవీర్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# స్త్రీశక్తి పథకంతో పెరిగిన ఆక్యుపెన్సీ

**డిమాండ్‌కు తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు పెంచాలి**

**సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్**

**విజయవాడ,నేటిధాత్రి:** డిమాండ్‌కు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈనెల 2, 3 తేదీలలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షతన సిపిఐ (యం) రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడ యం.బి. విజ్ఞానకేంద్రం లో జరిగాయి. ఈ సమావేశానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, యు.వాసుకి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరయ్యారు. డిమాండ్ కనుగుణంగా ఆర్టీసీ బస్సులు పెంచాలనే తీర్మానాన్ని ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా మంగళవారం సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఓ ప్రకటనను విడుదల చేసింది.డిమాండ్ కనుగుణంగా ఆర్టీసీ బస్సులు పెంచాలని సిపిఐ(యం) నేతలు కోరారు. స్త్రీ శక్తి పథకం తరువాత ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 67 శాతం నుండి 98 శాతానికి పెరిగిందనీ అయితే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిపోల్లోనే బస్సుల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులు ఎక్కడంతో మధ్యలో స్టేజీలలో ప్రయాణీకులను ఎక్కించుకోవడం లేదని, దిగవల్సిన ప్రయాణీకులను ఆగాల్సిన ప్రదేశంలో కాకుండా ముందుకు వెళ్ళి ఆపుతున్నారు అని అంతే కాక మహిళా ప్రయాణీకులను కొంతమంది పురుషులు, సిబ్బంది హేళనగా మాట్లాడుతున్నారు అని, బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని వివరించారు. సకాలంలో స్కూళ్ళకు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నారని చెప్పారు. ఆక్యూపెన్సీ పెరగడంతో, బస్సులు పాతవి కావడంతో తరచు మధ్యలో ఆగిపోతున్నాయని, రాత్రి సమయాల్లో కూడా ఆగిపోయి ఇబ్బందులు కలుగుతున్నాయని, ముఖ్యంగా స్త్రీలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడమేనన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్న రాష్ట్రాలకు వెళ్లి అధ్యయనం చేశాకే ఈ పథకం మన రాష్ట్రంలో అమలు చేశారు? కానీ పెరిగే ఆక్యుపెన్సీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయవలసిన బాధ్యతను వదిలేశారని ఆరోపించారు. ఫలితంగా ప్రయాణీకులు తీవ్ర సమస్య ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల ప్రయివేటు బస్సులలో 3 ప్రమాదాలు జరిగాయని, ఈ బస్సులపై రవాణా శాఖ సరైన పర్యవేక్షణ లేదని చెప్పారు. ప్రయాణీకుల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని,. వీటిని కూడా ఆర్టీసీ తీసుకొని నడపాలని కోరారు. సిబ్బందిపై 30 శాతం పైగా పని ఒత్తిడి పెరిగిందని ఇన్సర్వీస్ మరణాలు కూడా పెరుగుతున్నాయని తాజా ఉదంతాలు తెలియజేస్తున్నాయన్నారు. 11 వేల మంది. సిబ్బంది కావాలని ఆర్టీసీ అడుగుతున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని.. ప్రభుత్వం తక్షణం సిబ్బందిని రిక్రూట్ చేయాలని కోరారు. మహిళలు ఆధార్, ఇతర గుర్తింపు స్మార్ట్ఫోన్లో చూపినా అనేకచోట్ల అనుమతించడం లేదనీ, దీన్ని అనుమతించాలని అడిగారు. అనేక గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సుల సర్వీసులు లేవని తెలిపారు. సక్రమంగా బస్సులు ఏర్పాటు చేస్తే మరింతగా ప్రయాణీకులు పెరిగే అవకాశం ఉంటుందని, ఆర్టీసీ ఆదాయం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. స్త్రీశక్తి పథకం అనేక విధాలా ఉత్పత్తి పెరుగుదలకు, కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తుందని అన్నారు. కానీ ప్రభుత్వం ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా విద్యుత్ వాహనాలకు అనుమతి ఇచ్చిందని.. ఇది స్త్రీ శక్తి పథకం ఎత్తివేయడానికి దారి తీస్తుందని తెలిపారు. కనుక ఇప్పటికే పెరిగిన ప్రయాణికుల అవసరానికి అనుగుణంగా తక్షణం అదనపు బస్సులను పెంచాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సులు వేయాలని సిపిఐ (యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని నేతలు పేర్కొన్నారు.

# పరిచయ కార్యక్రమంలో నాయకులకు గజమాలతో సన్మానం

**తిరుపతి,నేటిధాత్రి:**తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి,, తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి మున్నూరు సుగుణమ్మ , రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ లను ఒకటవ క్లస్టర్ ఇంచార్జి కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శిలు, బుద్ధ ఇన్ చార్జీ నాయకులు ప్రధాన కార్యదర్శులు దృశ్యాలువాలు కప్పి పుష్పగుచ్చాను అందించి గజమాలతో ఘనంగా సన్మానించారు, మంగళవారం రామానాయుడు గార్డెన్ నందు జరిగిన తిరుపతి నియోజకవర్గం లోని వార్డు నాయకులు క్లస్టర్ల ఇన్చార్జీలు అధ్యక్షులు పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం , 1వ వార్డు బూత్ ఇన్చార్జి కొండా రామారావు , వార్డులలోని నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



# తిరుమలనాథ స్వామి హుండీ లెక్కింపు



నిజాంపేట,నేటిధాత్రి: శ్రీ తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు గత కొన్ని రోజుల క్రితం ఘనంగా నిర్వహించారు. నిజాంపేట మండలం చల్మెడ శివారులో గల తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వాహకులు ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలరోజులు, బ్రహ్మోత్సవాలతో కలిపి మొత్తం హుండీ ఆదాయం 84,709 వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని బ్యాంకులో జమ చేయనున్నట్లు చైర్మన్ అక్క పల్లి రామిరెడ్డి, ఈవో రవికుమార్ తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ, సీనియర్ అసిస్టెంట్ రమేష్, డైరెక్టర్ బాజా రమేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల,నేటిధాత్రి:2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ,అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని,నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలని అధికారులకు సూచించారు.నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని,ఎన్నికల ప్రక్రియ పూర్తిగా వీడియోగ్రఫీ చేయడం జరిగిందని తెలిపారు.ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్,12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే),13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని,ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు.అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం,ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులను సందర్శించి వంటశాల,ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు.తదనంతరం కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని,వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.పాఠశాలకు మంజూరైన భోజనశాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మండలంలోని రేగులగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలకు మంజూరైన అదనపు గదుల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి




కల్వకుర్తి,నేటి ధాత్రి:కల్వకుర్తి మంగళవారం కార్మికులంతా ఏకమై దేశ వ్యాప్త సమ్మెను తెలంగాణ కేంద్ర.రాష్ట్ర కార్మిక సంఘాల ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా కల్వకుర్తి TUCI శాఖ1.నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కై పోరాడుదాం.2.పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం.3. ఫిబ్రవరి 12వ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె. 4. కనీస వేతనం 26 వేల ఉండాలి.5. విద్యుత్ సవరణ చట్టం 2025 విబిజి రామ్ జీ చట్టం రద్దు చేయాలి దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది ఆయన మాట్లాడుతూ చట్టాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు తాలూకా అధ్యక్షుడు సాయిబాబు, ఉపాధ్యక్షులు మౌలాలి, కోశాధికారి మల్లేష్,కార్యవర్గ సభ్యులు వెంకటయ్య,వెంకటేష్,శీను, బాల్ చంద్రి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను వార్షిక పరీక్షలకు ప్రోత్సహించేలా ప్రత్యేక ప్రేరణ- అవగాహన తరగతులు

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య



మంచిర్యాల,నేటిధాత్రి:10వ తరగతి చదువుతున్న విద్యార్థులను వార్షిక పరీక్షలకు ప్రోత్సహించేలా ప్రత్యేక ప్రేరణ అవగాహన తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి,జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య,జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి,ఎ. టి. డి. ఓ. సురేష్, టి.ఎన్.జి.ఓ.స్ ప్రతినిధి గడియారం శ్రీహరి,మానసిక వైద్య నిపుణులు సునీల్ లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ-అవగాహన తరగతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని,ఇష్టంతో చదివి, పట్టుదలతో సాధించి ఉన్నత స్థానాలలో నిలవాలని, తల్లిదండ్రులకు,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ప్రేరణ-అవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని,విషయ నిపుణులైన ఉపాధ్యాయులు ఇచ్చే మెలకువలను పాటించి, అన్ని సబ్జెక్టులలో 100 శాతం మార్కులు సాధించాలని, వార్షిక ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణతతో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ధర్మానంద్ గౌడ్,ఉపాధ్యాయులు,వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ముప్పనపల్లి దర్గా ఉరుసు ఉత్సవాలకు రోడ్డు మరమ్మతులు




ఏటూరునాగారం,నేటిధాత్రి:కన్నాయిగూడెం మండలం, మొప్పనపల్లి గ్రామంలో నిర్వహించనున్న పవిత్ర దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతులు చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమం ముప్పనపల్లి గ్రామ ఉప సర్పంచ్ గౌరవనీయులు చిదరి సుమన్ గారి సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. ఉరుసు ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో, వారి సౌకర్యార్థం ఈ రోడ్డు మరమ్మతులు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయి.గ్రామాభివృద్ధి, ప్రజా సౌకర్యాల పట్ల నిరంతర శ్రద్ధ చూపుతున్న ఉప సర్పంచ్ చిదరి సుమన్ గారి సేవలను గ్రామస్తులు, దర్గా కమిటీ సభ్యులు అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ ఉరుసు ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించబడాలని గ్రామ పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

# కష్టపడితే మనదే విజయం

## బీఫాంలు అందించిన మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు, పటాన్ చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్..

### టిక్కెట్ రాని నేతలు అధైర్య పడొద్దు..
### పార్టీ పదవులు నామినేటెడ్ పోస్టులలో వారికి ప్రాధాన్యం..
### ఐక్యంగా పనిచేస్తే ఐదు మున్సిపాలిటీలు మనవే..




పటాన్‌చెరు,నేటిధాత్రి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కష్టపడి ప్రజల్లోకి తీసుకుని వెళ్తే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు, పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు.మంగళవారం ఐదు మున్సిపాలిటీల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ ఫాం లను అశోక్ నగర్ లోని కాట నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు ఉన్న నాయకులనే కౌన్సిలర్



అభ్యర్థులుగా టికెట్లు కేటాయించినట్లు తెలిపారు. టికెట్ల కేటాయింపులు సర్వే ఆధారంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు వివరించారు. టికెట్లు రాని అభ్యర్థులు అధైర్య పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులలో టికెట్ రాని నేతలకు పెద్దపీటవేస్తామని హామీ ఇచ్చారు. ఆ నేతలు నిరుత్సాహపడకుండా ఆయా వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయాలని కోరారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కష్టపడి పని చేయండి నియోజకవర్గం లోని అన్ని మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

## పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి నివాసంలో బీ--ఫారమ్‌ల అందజేత



పటాన్‌చెరు,నేటిధాత్రి: నియోజకవర్గం పరిధిలోని అన్ని మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ పట్ల నాయకులు కార్యకర్తలు గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు ఈ పది రోజులు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని నాయకులకు కార్యకర్తలకు నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి పిలుపునిచ్చారు మంగళవారం నాడుపటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ బీ--ఫారమ్‌ల అందజేశారు ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీకి చెందిన 18 వార్డులు, ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన 26 వార్డుల అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ బీ--ఫారమ్‌లు అందజేశారు.అదేవిధంగా జిన్నారం, గడ్డపోతారం, గుమ్మడిదాల ప్రాంతాలకు సంబంధించిన బీఆర్ఎస్ పార్టీ బాధ్యతలను ఆయా పార్టీ ఇంచార్జ్‌లకు అధికారికంగా అప్పగించారు.ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ ఇంచార్జ్ ఎర్రోళ్ల శ్రీనివాస్ , ఇంద్రేశం మున్సిపాలిటీ ఇంచార్జ్ గోసుల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ,మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ , తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించిన పోలీస్ అధికారుల పదవీ విరమణ



మహబూబాబాద్,నేటిధాత్రి:మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులుయాకూబ్ అలీ, ఎస్.ఐ (డీ.సీ.ఆర్.బీ)1984 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి 43 సంవత్సరాల ఘనమైన పోలీస్ సేవలు అందించారని కొనియాడారు..బోడ తులసయ్య 1990లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి2023లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది మొత్తం 36 సంవత్సరాల సేవలు అందించారని.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందుతున్న అధికారులకు తమ తరఫున మరియు మహబూబాబాద్ జిల్లాపోలీస్ శాఖ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.యాకూబ్ అలీ1984 బ్యాచ్‌కు చెందినవారై, సుమారు 43 సంవత్సరాల పాటు శాంతి భద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో, ప్రజా సేవలో విశేష సేవలు అందించారని ప్రశంసించారు. అదేవిధంగా బోడ తులసయ్య 36 సంవత్సరాల పాటు శాఖకు అంకితభావంతో సేవలందించి విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచారని అభినందించారు.పదవీ విరమణ అనేది జీవితంలో కొత్త అధ్యాయమని, మిగిలిన జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని సూచించారు. నిత్యం ఏదో ఒక వ్యాపకంతో చురుకుగా ఉండాలని కోరారు.రిటైర్మెంట్ అనంతరం లభించే బెనిఫిట్స్‌ను ప్రభుత్వ బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో భద్రపరుచుకోవాలని, అధిక లాభాల ఆశ చూపే మోసగాళ్ల పట్ల మరియు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.పదవీ విరమణ పొందిన వారిని కుటుంబ సభ్యులు గౌరవప్రదంగా చూసుకోవాలని, వారి మానసిక ప్రశాంతతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ నాగేశ్వర్ రావు, ఆర్. ఐ సోములు, డీ.సీ.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఉపేంద్ర రావు సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ



జైపూర్,నేటిధాత్రి:జైపూర్ మండలం టేకుమట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు, పెన్సిళ్లను గోనె వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థిని,విద్యార్థులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గోనె వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులతో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.అలాగే ప్రాథమిక పాఠశాలకు ఏ అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా టేకుమట్ల గ్రామ సర్పంచ్ బల్ల వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు నేర్పించే విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో నిలిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి, వేణుమాధవ్,గ్రామ సర్పంచ్ బల్ల వెంకటేష్,ఉప సర్పంచ్ గోనె ప్రవీణ్,వార్డ్ మెంబర్లు అశోక్,తరుణ్,కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నూతన సర్పంచ్



జహీరాబాద్,నేటిధాత్రి:సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని జిర్లపల్లి గ్రామ సర్పంచ్ అమరేశ్వరి శివమణి ప్రచార సమయంలో ఎస్సీ కాలనిలోకి వెళ్ళాడు. అక్కడ కాలనీవాసులు తాగునీటి సమస్య ఉందని ఆయనకు వివరించారు. మీ సమస్యను తీరుస్తానని మాట ఇచ్చాడు. ఆయనను ప్రజలు దీవించి భారీ మెజార్టీతో జిర్లపల్లి సర్పంచ్ గా గెలిపించి సర్పంచ్ పగ్గాలు అప్పజెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం.. గెలిచిన తన సొంత నిధులతో బోర్ పెట్టించారు. ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీర్చిన సర్పంచ్ అమరేశ్వరి శివమణి పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ రాజశేఖర్ నాయకులు వెంకట్ రెడ్డి, మధు సుదన్ రెడ్డి, అనీ ఫ్, జాకీర్, బిచయ్య, నవీన్, భరత్, రాజు,ఆశీర్వాదం, యేసు, సురేందర్, వసంత్, రహి మొద్దీన్,వెంకట్, తదితరులు పాల్గొన్నారు,

# తన అభిమాన నాయకుడి పుట్టినరోజులు రక్తదానం



బాలానగర్,నేటిధాత్రి:మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన సందర్భంగా మంగళవారం జడ్చర్ల పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రక్తదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ మండలం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సభావత్ రమేష్ నాయక్ లక్ష్మారెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదానం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలన్నారు. తన అభిమాన నాయకుడి పుట్టినరోజున ఒక ప్రాణాన్ని కాపాడే రక్తదాన కార్యక్రమంలో పాల్గొనడం పట్ల పార్టీ శ్రేణులు ఆయనను అభినందించాయి.

# మేడారానికి "యునెస్కో" గుర్తింపు మంత్రి సీతక్కతోనే సాధ్యం

మేడారం జాతర విజయవంతంలో మంత్రి సీతక్క కృషి ఎనలేనిది...

కలెక్టర్, ఎస్పీ మరియు అధికారులందరికి అభినందనలు....

జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి...



**మంగపేట,నేటిధాత్రి:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా మేడారం సమ్మక్క సారక్క మహా జాతర మునిపెన్నడూ లేని విధంగా విజయవంతమైందని జాతర విజయవంతం కావడంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క కృషి ఎనలేనిదని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు మంగళ వారం స్థానిక విలేఖరులతో సాంబశివరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి వందల కోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చి బావితరతరాలకు గుర్తుండే విధంగా వేయి సంవత్సరాల చరిత్రను నిర్మించిన మహనీయురాలు మంత్రి సీతక్క అన్నారు జాతర నిర్వహణలో మంత్రి సీతక్కకు వచ్చిన మంచి పేరును తట్టుకోలేని కొందరు రాజకీయ కుట్రలకు పాల్పడడం విచారకరమన్నారు ప్రపంచ దేశాల నుండి భక్తులు వచ్చి మేడారం జాతర అద్భుతం అని కితాభిస్తుంటే స్థానిక ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా సీతక్క ప్రతిష్టను తగ్గించలేరన్నారు మేడారం జాతరపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తాను మరియు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు దుష్ప్రచారం చేసే వ్యక్తులు లేదా వ్యవస్థల పట్ల తాము క్షమా గుణం కలిగి ఉన్నా సమ్మక్క సారలమ్మలు వారికి తగిన శాస్తి చేస్తారని అన్నారు రాబోయే రోజుల్లో మేడారం జాతరకు యూనిస్కో గుర్తింపు తీసుకురావడం సీతక్కతోనే సాధ్యమని సాంబశివరెడ్డి అన్నారు పదిహేను రోజులపాటు కారోబార్ నుండి కలెక్టర్ వరకు వేలాదిమంది సిబ్బంది ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ఎస్పీ అహర్నిశలు కష్టపడి పనిచేసి మేడారం మహా జాతరను విజయవంతం చేసిన వారందరికీ పేరుపేరున అభినందనలు తెలిపారు

# ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం "ఢిల్లీ చలో"

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ పిలుపు

ప్రాథమిక ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాల్సిందే...

సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ప్రభుత్వ పాఠశాలలనే బలోపేతం చేయాలి




**కేసముద్రం,నేటిధాత్రి:** దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అన్యాయాలు, విధానపరమైన దాడులు, జీవన భద్రతపై ముప్పును నిరసిస్తూ... ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ ఏ ఐ జెఏ సిటిఓ( జాక్టో) ఆధ్వర్యంలో తలపెట్టినఫిబ్రవరి 5, 2026న ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ -- "ఢిల్లీ చలో" ధర్నా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ పిలుపునిచ్చారుమంగళవారం కేసముద్రం గ్రామ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ( టి పి టి ఎఫ్ ) కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ నేతృత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ ప్రస్తుతంఉపాధ్యాయులను టెట్ భారంతో వేధించడం, ఎన్ పి ఎస్/ యుపిఎస్ పేరుతో పెన్షన్ భద్రతను లాక్కోవడం,ఎం ఈ పి--2020 ద్వారా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడం,పాఠశాలల విలీనాలు, మూసివేతలు,ఉపాధ్యాయులను బోధనేతర పనులతో ఇబ్బంది పెట్టడం,కాంట్రాక్ట్ ఉద్యోగులపై వివక్ష,8వ వేతన సంఘం( 8వ సిపిసి) అమలులో తీవ్ర జాప్యం మొదలగు సమస్యలు అన్ని కలిసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను కూల్చివేసే ప్రమాదకర పరిస్థితికి తీసుకెళ్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో( టెట్) నుండి మినహాయింపు,ఎన్ పి ఎస్/ యు పి ఎస్, రద్దు చేసి ఓ పి ఎస్, పునరుద్ధరణ,ఎన్ ఈ పి--2020 ఉపసంహరణ,ప్రాథమిక ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు,పాఠశాలలవిలీనాలుమూసివేతలకు తక్షణమే బ్రేక్,బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు విముక్తి,కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ మరియు కనీస వేతనాల అమలు,8వ వేతన సంఘాన్ని వెంటనే అమలు చేయాలిఅనే డిమాండ్లపై ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సహనం ఇక చరమాంకానికి చేరుకుందని,ఇది వ్యక్తిగత సమస్య కాదనీ, ప్రభుత్వ విద్యను, భవిష్యత్ తరాలను కాపాడుకునే పోరాటం అనీ ఆయన ఉద్ఘాటించారుఈ హక్కుల సాధన కోసం ఫిబ్రవరి 5, 2026 -- ఢిల్లీ చలోకు కంకణ బద్దులై తరలి రావాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరారు.ఒక్క ఉపాధ్యాయుడు -- ఒక్క అడుగు ముందుకేస్తే...ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిందేననీ,"ఐక్యతే మన బలం...పోరాటమే మన మార్గం"....అని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీసం నర్సయ్య, కోడం శ్రీనివాస్, అప్పాల నాగరాజు, తమ్మే శ్రీనివాస్, రణధీర్,శ్రీధర్ ఇనుగుర్తి మండల కార్యదర్శులు గంగుల వేణు, సారంగపాణి, వెల్దండి సతీష్, నర్సింహా చారీ, రాహుల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఆవరణలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు

**భూపాలపల్లి,నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ సరిత ఆధ్వర్యంలో ఫిర్యాదుల బాక్సను ఏర్పాటు చేశారు.గ్రామంలోని సమస్యలను మౌఖికంగా చెప్పడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా ఫిర్యాదు బాక్సులో వేయవచ్చని సర్పంచ్ తెలిపారు. ప్రతి సోమవారం ఫిర్యాదు బాక్సను తెరిచి అందులో వచ్చిన సమస్యలను పరిశీలించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.సోషల్ మీడియాలో సమస్యలను వైరల్ చేయకుండా, నేరుగా ఫిర్యాదు బాక్స్ ద్వారా సమస్యలను తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు శ్రీజ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలను వ్యాపారంగా మార్చిన పాలక పార్టీలు

రాజకీయ విలువలకు తిలోదకాలు ఇచ్చిన బూర్జువా పార్టీలు

ప్రజా సమస్యల పరిష్కారం, రాజకీయ విలువలకై ఎన్నికల్లో ఎంసిపిఐ(యు) పోటీ

ఎంసిపిఐ(యు) డివిజన్ కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్




**నర్సంపేట,నేటిధాత్రి:** ప్రజాసేవ కోసం ఏర్పడిన రాజకీయాలను వ్యాపారంగా మార్చి లబ్ధి పొందడమే ధ్యేయంగా రాజకీయ విలువలకు తిలోదకాలు ఇచ్చి ప్రలోభాలతో పాలక పార్టీలు ప్రజలను ప్రభావితం చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు లాంటిదని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఎంసిపిఐ(యు) నర్సంపేట డివిజన్ సమావేశం డివిజన్ సహాయ కార్యదర్శి కామ్రేడ్ కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన పట్టణంలోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ నీతిగా నిజాయితీగా ప్రజలకు సేవ చేయాల్సిన పాలక పార్టీలు స్వార్థంతో అధికారం కోసం ఎన్నికల్లో గెలవడానికి విలువలను మరిచి తప్పుడు పద్ధతుల్లో ఓటర్లను ప్రభావితం చేసి రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ప్రజా సమస్యలు విలయతాండవం చేస్తున్న సమస్యలపై చిత్తశుద్ధిలేని పాలకులు సమస్యలను మరింత పెంచి పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీతికి నిజాయితీకి రాజకీయ విలువలకు నిలువుటద్దంగా నిలిచిన అసెంబ్లీ టైగర్ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ లాంటి త్యాగదనుల ఆశలు ఆశయాలకు భిన్నంగా పాలక పార్టీలు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజలకు అవసరాలు తీర్చడానికి పోరాడడానికి ఎర్రజెండా నిత్యం పరితపిస్తుందని దోపిడీ పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతుందని ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా నిలబడుతుందని ఈ క్రమంలో ప్రజా సమస్యలను ఎజెండాగా చేసుకుని రాజకీయ విలువలను కాపాడడానికి ఎంసిపిఐ(యు) నిరంతరం ప్రయత్నిస్తుందని అందుకోసమే మున్సిపల్ ఎన్నికల్లో ఐదు వార్డుల్లో పోటీ చేస్తున్నట్లు ప్రజలు ఆదరించి గెలిపించాలని ఆ దిశలో కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాయబ్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబూరావు,వంగల రాఘసుధ, డివిజన్ నాయకులు కలకొట్ల యాదగిరి, దామ సాంబయ్య, మహమ్మద్ అలీ సాబ్, కర్నే సాంబయ్య, చెక్క వెంకటయ్య, ఏఐసిటియు జిల్లా కోశాధికారి మాశోక్ తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రచారంలో దూసుకుపోతున్న మేడిశెట్టి ఉమా శ్రీధర్



**చేర్యాల,నేటిధాత్రి:** చేర్యాల మున్సిపల్ పరిధిలో ఈరోజు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రచారం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన బిఆర్ఎస్ నాయకులను గెలిపించాలని ప్రజలను కోరారు ఈ సందర్భంగా పలు వార్డులలో తిరిగి ప్రచారం చేశారు10 వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి మేడిశెట్టి ఉమా-శ్రీధర్ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు, తెలుసుకుని వాటి అమలుకు కచ్చితంగా కృషి చేస్తానని అభ్యర్థి మేడిశెట్టి ఉమా శ్రీధర్ ప్రజలకు మాట ఇచ్చారు. గెలిచిన, ఓడిన ప్రజలలోనే, రాజకీయాలలోనే ఉన్నామని ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించామని, ఇక ముందు కూడా వార్డు సభ్యులకు ఏ సమస్య వచ్చినా దగ్గర ఉండి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత ఎన్నికలలో ప్రజలందరూ సహకరించిన ఒక ఓటుతో ఓడిపోయామని అదృష్టం వరించలేదని అన్నారు. ఈసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలందరికీ మనస్ఫూర్తిగా వేడుకుంటున్నారు.. మీ అందరి సహకారంతో చేరాలలోనే అగ్రగామిగా మన వార్డును చేర్చిదిద్దామని మాట ఇచ్చారు ఈ సందర్భంగా ఔషర్ల కిషోర్ కాసుల శ్రీనివాస్ పచ్చిమడ్ల పరశురాం గుడాల శీను పెద్ద ఎత్తున బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సహకారం అందజేస్తాం-ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్,నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధి హామీ నిధులు ఎనిమిది లక్షలతో నిర్మించిన టాయిలెట్లను ప్రారంభించారు. అనంతరం గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం సహకారంతో పాఠశాలలో ఏర్పాటుచేసిన లైబ్రరీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ విద్యార్థుల కోరిక మేరకు పాఠశాలలో డైనింగ్ హాల్, తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని కొత్త పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటుకు సహకరించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంను ఈసందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, స్థానిక సర్పంచ్ దూలం కల్యాణ్, తాహశీల్దార్ అంబటి రజిత, ఎంపిడిఓ రాము, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ముద్దం నగేష్, ఉప సర్పంచ్ తిరుపతి, సాగి అజయ్ రావు, దూలం శ్రీనివాస్, దూలం అంజయ్య, బుర్గ గంగన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు బ్రిడ్జ్ పరిశీలించిన కామారెడ్డి పీఆర్డీఈ



**నిజాంపేట,నేటిధాత్రి:** జిల్లాలో సరిహద్దులో గల బ్రిడ్జి ప్రమాదంలో ఉంది. నిజాంపేట మండలం నంద గోకుల్ గ్రామం నుండి ఇస్సానగర్ వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న బ్రిడ్జ్ గత కొన్ని నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి కింది భాగం పూర్తిగా కొట్టుకుపోయి కూలిపోయే దశలో ఉంది. దీంతో స్పందించిన కామారెడ్డి పీఆర్డీఈ స్వామిదాస్ బ్రిడ్జినీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రిడ్జ్ కింది భాగం పూర్తిగా కొట్టుకుపోవడంతో ఈ రోడ్డుపై భారీ వాహనాలు వెళ్ళవద్దని ఆయన హెచ్చరించారు. సమస్యను వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోతనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాతూరి బాల్ రెడ్డి, నందగోకుల్ సర్పంచ్ పాతూరి భాను ప్రకాష్ రెడ్డి, ఇస్సానగర్ సర్పంచ్ ధర్మాగారి రాజా గౌడ్, కృష్ణ యాదవ్ తదితరులు ఉన్నారు.

# క్రీడలతో యువతలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

ఎంపీడీవో మున్వర్



**కొత్తగూడ,నేటిధాత్రి:** కొత్తగూడ మండల కేంద్రంలోని స్పోర్ట్స్ పాఠశాల ఆవరణంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడలను ఎంపీడీవో మన్వర్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతమైన క్రీడాకారులను వెలికి తీసేందుకు దోహదపడుతున్నాయని ఆయన అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు.మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు పంపించేందుకు ఈ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మన్వర్ తెలిపారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో పాల్గొని మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పీఈటీలు, క్రీడా నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

ప్రచారంలో దూసుకుపోతున్న తుమ్మలపల్లి లీల సంజీవులు



**చేర్యాల,నేటిధాత్రి:** చేర్యాల మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఇంటింటికి ప్రచారం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లు మరియు ఆడబిడ్డలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ఇలా ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మలపల్లి లీల సంజీవులు గారిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని అన్నారు వార్డు అభ్యర్థి తుమ్మనపల్లి లీల సంజీవులు మాట్లాడుతూ వార్డులో ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో లింగంపల్లి శ్రీనివాస్, సార్ల లింగం ముదిరాజ్, బొచ్చు ఎల్లయ్య యాదవ్, ఏర్పుల రాజు, ఉప్పల వంశీ కృష్ణ, ఈగ కనకరాజు, రుద్రారం దుర్గయ్య, చింతల రమేష్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వార్డు అభివృద్ధికి కృషి చేస్తా

వార్డు ప్రచారంలోఏకు దివ్య విద్య సాగర్



**పరకాల,నేటిధాత్రి:** మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఏకు దివ్య -విద్య సాగర్ వార్డులో ఇంటింటా తిరుగుతూ తమను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాలనే సంకల్పంతో,వార్డు అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా,నిజాయితీతో ప్రజాసేవ చేయాలనే ఆశయంతో తాను ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. ప్రజలతో నేరుగా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా పనిచేస్తానని చెప్పారు. 20వ వార్డులో మౌలిక వసతుల వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించి,4వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

# క్రిటికల్ పోలింగ్ బూత్ లను పరిశీలించిన రాష్ట్ర జనరల్



**మెట్పల్లి,నేటిధాత్రి** మెట్పల్లి లోని క్రిటికల్ పోలింగ్ బూత్ లను రాష్ట్ర జనరల్ అబ్జర్వర్ పుర ఎన్నికల పరిశీలకుడు కాళీ చరణ్ ఐఏఎస్ పరిశీలించారు కాళీ చరణ్ ఐఏఎస్ మాట్లాడుతూ పుర ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు తగు సూచనలు చేసినారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎన్ శ్రీనివాస్ ఎమ్మార్వో నీతా మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ డి ఈ నాగేశ్వరరావు సిఐ అనిల్ కుమార్ సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్ పాల్గొన్నారు

# మెట్ పల్లి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో 31 వార్షికోత్సవ వేడుకలు



**మెట్పల్లి,నేటిధాత్రి:** మెట్ పల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 31 వార్షికోత్సవం పురస్కరించుకొని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం నిత్య హోమం బలిహరణం అనంతరం స్వామివారి నీ ఎదుర్కోలు కార్యక్రమం జరిగింది అనంతరం లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం ఘనంగా జరిగింది అనంతరం స్వామి వాళ్లకు ఓడి బియ్యం కార్యక్రమం తీర్థ ప్రసాదం అన్న ప్రసాదం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పర్మినర్సయ్య గంగపుత్ర సంఘ అధ్యక్షులు ఆర్మూర్ నరేందర్ ప్రోహర్ హేమ చందర్ నాగయ్య రాజేందర్ సురేష్ గంగాధర్ ఆర్మూర్ పోచయ్య తోపారపు నాగయ్య పురుషోత్తం తోపారం రాజేందర్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
“నేటిధాత్రి 9” యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో “23 వసంతాల” అనుభవం
కలిగిన “నేటిధాత్రి” తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు “నేటిధాత్రి 9” యూట్యూబ్ ఛానల్‌ని
“పాఠక దేవుళ్ళ కోసం ” “ శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ ” ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

“నేటిధాత్రి” పత్రికను ఆదరించిన
విధంగానే “నేటిధాత్రి 9”
“ యూట్యూబ్ ఛానల్ ” కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....





మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**




మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

“నేటిధాత్రి” 21వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది “అక్షరం”

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో “20 మైలు రాళ్లు” దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ “21 వ వసంతం” లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

# విటమిన్ బి12 లోపిస్తే ఏయే ఆహారాలను తినాలి..?

మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లలో విటమిన్ బి12 కూడా ఒకటి. దీన్నే సయానో కోబాలమైన్ లేదా కోబాలమైన్ అని పిలుస్తారు. మన శరీరంలో అనేక జీవక్రియలను సరిగ్గా నిర్వహించడంలో విటమిన్ బి12 ముఖ్య పాత్ర పోషిస్తుంది. నాడీ మండల వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. డీఎన్ఏ సంశ్లేషణకు సహాయం చేస్తుంది. విటమిన్ బి12 లోపం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇవి కొందరిలో పలు లక్షణాలను కలగజేస్తాయి. విటమిన్ బి12 లోపం వల్ల కొందరిలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ కొందరిలో స్వల్ప లేదా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ఒక్కొక్కరిలో వేర్వేరుగా ఉంటాయి. విటమిన్ బి12 లోపం వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.




### ఎందుకు వస్తుంది..?

విటమిన్ బి12 మనకు అధికంగా మాంసం లేదా జంతు సంబంధ ఉత్పత్తుల్లో లభిస్తుంది. అందువల్ల మాంసాహారాల్లో ఈ సమస్య కనిపించడం అరుదు. శాకాహారుల్లో, కనీసం కోడిగుడ్లు తినని వారు లేదా పాలు తాగని వారు, పెరుగు, నెయ్యి వంటివి కూడా తినని వారిలో ఈ విటమిన్ లోపం ఏర్పడుతుంది. కొందరు మాంసాహారం తింటున్నా ఇతర పోషకాహారాలను తినకపోవడం వల్ల కూడా విటమిన్ బి12 లోపం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. ఆటో ఇమ్యూన్ వ్యాధి ఉంటే అలాంటి వారి శరీరం విటమిన్ బి12 ను సరిగ్గా శోషించుకోలేదు. దీంతో కూడా ఈ విటమిన్ లోపం ఏర్పడుంది. జీర్ణాశయ, పేగుల సమస్యలు ఉన్నా, శస్త్ర చికిత్సలు జరిగిన వారిలో, డయాబెటిస్ లేదా గ్యాస్ ట్రబుల్ మందులను వాడేవారిలో విటమిన్ బి12 లోపం వస్తుంది. విటమిన్ బి12 లోపం ఉంటే తీవ్రమైన నీరసం, అలసట ఉంటాయి. చేతులు, పాదాల్లో స్పర్శ లేనట్లు ఉంటుంది లేదా సూదుల్తో గుచ్చినట్లు ఉంటుంది.

### ఎవరికి ఎంత కావాలి..?

విటమిన్ బి12 లోపం ఉన్నవారిలో కొందరికి చర్మం పాలిపోయి లేదా పసుపు రంగులో కనిపిస్తుంది. నాలుక వాపులకు గురై ఎరుపు రంగులో దర్శనమిస్తుంది. ఆకలి అనిపించదు. ఏ ఆహారం తినాలనిపించదు. బరువు తగ్గుతారు. ఏ విషయంపై కూడా ధ్యాస పెట్టలేకపోతుంటారు. శ్వాస తీసుకోవడంలో సమస్యగా అనిపిస్తుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపిస్తాయి. కొందరు డిప్రెషన్ బారిన పడతారు. చిరాగ్గా అనిపిస్తుంది. ఇక రోజుకు ఎవరికి ఎంత మోతాదులో విటమిన్ బి12 అవసరం అవుతుందనే విషయానికి వస్తే 19 ఏళ్లకు పైబడిన వారికి రోజుకు 2.4 మైక్రోగ్రాముల మేర విటమిన్ బి12 అవసరం. గర్భిణీలకు రోజుకు 2.6 మైక్రోగ్రాముల మేర ఈ విటమిన్ కావాలి. పాలిచ్చే తల్లులు రోజుకు 2.8 మైక్రోగ్రాముల విటమిన్ బి12ను తీసుకోవాల్సి ఉంటుంది. విటమిన్ బి12 లోపం ఉన్నవారికి వైద్యులు మందులను ఇస్తుంటారు. విటమిన్ బి12 ట్యాబ్లెట్లను డాక్టర్ సలహా మేరకు వేసుకుంటే ఈ లోపం తగ్గుతుంది. సాధారణంగా 500 మైక్రోగ్రాముల విటమిన్ బి12 ట్యాబ్లెట్‌ను మింగితే అందులో శరీరం కేవలం 10 మైక్రోగ్రాముల విటమిన్ బి12 ను మాత్రమే శోషించుకుంటుంది.

### ఈ ఆహారాల్లో..

విటమిన్ బి12 మనకు ఎక్కువగా జంతు సంబంధ ఉత్పత్తుల్లో లభిస్తుంది. మటన్ లివర్, కిడ్నీలు, చేపలు, రొయ్యలు, పాలు, చీజ్, పెరుగు, కోడిగుడ్లు, చికెన్ వంటి ఆహారాలను తరచూ తింటుంటే విటమిన్ బి12ను పొందవచ్చు. పలు శాకాహారాల్లోనూ మనకు విటమిన్ బి12 స్వల్ప మోతాదులో లభిస్తుంది. ఫోర్టిఫైడ్ సిరియల్స్, సోయా పాలు, బాదం పాలు, న్యూట్రిషనల్ ఈస్ట్, పుట్టగొడుగులు వంటి శాకాహారాలను తినడం వల్ల కూడా విటమిన్ బి12 లభిస్తుంది. కానీ వీటిల్లో స్వల్ప మోతాదులో మాత్రమే ఈ విటమిన్ ఉంటుంది. ఇలా విటమిన్ బి12 ఉన్న ఆహారాలను రోజూ తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.

# రోజూ వీటిని తినండి..!

## కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు



ప్రస్తుత తరుణంలో అధిక కొలెస్ట్రాల్ సమస్య చాలా మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. శరీరంలో కొలెస్ట్రాల్ నిల్వలు పేరుకుపోవడం కారణంగా గుండె జబ్బులు కూడా వస్తున్నాయి. చిన్న వయస్సులో ఉన్నవారు కూడా గుండె పోటు బారిన పడి చనిపోతున్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్నాయని తెలియడం లేదు. దీంతో ముప్పు ఏర్పడుతోంది. కనుక ప్రతి ఒక్కరు వయస్సుతో సంబంధం లేకుండా కనీసం ఏడాదికి ఒకసారి అయినా సరే లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు చేయించుకుని కొలెస్ట్రాల్ స్థాయిలను చెక్ చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉందీ లేనిదీ సులభంగా గుర్తించవచ్చని, కొలెస్ట్రాల్ అధికంగా ఉంటే అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవచ్చని, దీంతో గుండె పోటు రాకుండా అడ్డుకోవచ్చని చెబుతున్నారు. అయితే కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు రోజూ వ్యాయామం చేయడంతోపాటు ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీంతో కొలెస్ట్రాల్ లెవల్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. ఇక అందుకు ఏమేం ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### ఓట్స్..

కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఓట్స్ అద్భుతంగా పనిచేస్తాయి. వీటిల్లో బీటా గ్లూకాన్ ఉంటుంది. ఇది జెల్ లాంటి పదార్థం. కనుక ఓట్స్‌ను తిన్నప్పుడు ఇది మన శరీరంలో కొలెస్ట్రాల్‌కు అతుక్కుపోతుంది. అనంతరం వ్యర్థం రూపంలో బయటకు వస్తుంది. కనుక ఓట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. ఓట్స్‌ను కొందరు రోజూ ఉదయం పాలతో కలిపి తింటారు. లేదా ఓట్‌మీల్, ఉప్మా లాగా ఓట్స్‌ను తయారు చేసి తినవచ్చు. ఓట్స్ లాగే బార్లీ గింజలు కూడా మేలు చేస్తాయి. వీటిల్లోనూ బీటా గ్లూకాన్ ఉంటుంది. ఇది కూడా కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. బార్లీ గింజలను ఉడకబెట్టి తినవచ్చు. లేదా నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజూ తాగవచ్చు. దీంతో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే బాదంపప్పు, వాల్ నట్స్, అవిసె గింజలను తినడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఫైబర్, ప్లాంట్ స్టెరాల్స్ కూడా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. కనుక రోజూ వీటిని గుప్పెడు మోతాదులో నానబెట్టి తింటుంటే మేలు జరుగుతుంది.

### చేపలు..

చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల రక్త నాళాలు, గుండె కండరాల వాపులు తగ్గిపోతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. తరచూ చేపలను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. శనగలు, పప్పు దినుసులు, కిడ్నీ బీన్స్ వంటి వాటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిని తింటే కొలెస్ట్రాల్‌ను శరీరం శోషించుకోకుండా చూస్తాయి. దీని వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ఈ పప్పు దినుసులను రోజూ కూరల్లో వేసి తినవచ్చు. లేదా నేరుగా ఉడకబెట్టి తినవచ్చు.

### పండ్లు..

అవకాడోలలో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. యాపిల్ పండ్లు, బెర్రీలు, సిట్రస్ జాతికి చెందిన పండ్లను తింటున్నా కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. బెండకాయలు, వంకాయలు వంటి కూరగాయలు కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయం చేస్తాయి. కనుక వీటిని కూడా తరచూ తినాలి. ఇలా పలు రకాల ఆహారాలను తరచూ తినడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు.

# ఇది.. పిచ్చి మొక్క అనుకుంటే పొరపాటు పడినట్లే..!

మన చుట్టూ పరిసరాల్లో అనేక రకాల మొక్కలు పెరుగుతుంటాయి. వాటిల్లో ఔషధ గుణాలు ఉండే మొక్కలు చాలానే ఉన్నాయి. కానీ వాటి గురించి చాలా మందికి తెలియదు. వాటిని చూస్తే చాలా మంది పిచ్చి మొక్కలని అనుకుంటారు. అయితే అవి అందించే ప్రయోజనాల గురించి చాలా మందికి అవగాహన లేదు. ఇప్పుడు చెప్పబోయే మొక్క కూడా అలాంటిదే. అదే వాము మొక్క. చూసేందుకు ఇది పిచ్చి మొక్కలా ఉంటుంది. కానీ ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. అద్భుతమైన లాభాలను అందిస్తుంది. వాము మొక్క ఆకులు వాము వాసననే కలిగి ఉంటాయి. వీటిని నీటిలో మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వాము మొక్క పలు వ్యాధులను నయం చేస్తుందని వారు అంటున్నారు.

జీర్ణ, శ్వాసకోశ సమస్యలకు..

వాము మొక్క ఆకులు జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఈ ఆకుల్లో ఉండే పలు సమ్మేళనాలు మన జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తాయి. దీంతో జీర్ణశక్తి మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. వాము ఆకుల నీళ్లను తాగడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోవడంతోపాటు కడుపు నొప్పి తగ్గుతుంది. తీవ్రమైన గ్యాస్ సమస్య ఉన్నవారికి ఈ ఆకులు ఎంతో మేలు చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలోనూ ఈ ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. దగ్గు, జలుబు, ఇతర శ్వాస సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారి గాలి సరిగ్గా లభిస్తుంది. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం పొందవచ్చు. ఆస్తమా, బ్రాంకైటిస్ ఉన్నవారికి సైతం మేలు జరుగుతుంది.



### రోగ నిరోధక శక్తికి..

వాము ఆకుల్లో థైమోల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ సెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల వాము ఆకులను పేస్ట్‌లా చేసి చర్మంపై రాస్తుంటే చర్మ ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. గజ్జి, తామర వంటి చర్మ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. వాము ఆకుల్లో ఉండే మినరల్స్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ గా వచ్చే వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. చిన్నారులకు సైతం ఈ ఆకులు ఎంతో మేలు చేస్తాయి. వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. ఆరోగ్యం మెరుగు పడుతుంది.

వాము ఆకులను నోట్లో వేసుకుని నమిలితే ఎంతో మేలు జరుగుతుంది. ఈ ఆకుల్లో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు నోట్లో ఉండే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల నీళ్లను తాగుతుంటే బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ ఆకుల నీళ్లను సేవిస్తే శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. వాము ఆకులను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. లేదా ఈ ఆకుల జ్యూస్‌ను కాస్త తీసి దాన్ని కొద్దిగా తేనెతో కలిపి తీసుకోవచ్చు. చర్మంపై పూతగా ఉపయోగించవచ్చు. లేదా మీరు రోజూ చేసుకునే కూరల్లో, ఇతర వంటల్లోనూ వేయవచ్చు. ఇలా ఈ ఆకులతో అనేక లాభాలను పొందవచ్చు.

# వర్షాకాలం.. ఈ కూరగాయలు తినే ముందు 100 సార్లు ఆలోచించండి..!



కూరగాయలు ప్రయోజనకరంగా ఉంటాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎందుకంటే వాటిలో అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. కూరగాయలను క్రమం తప్పకుండా తీసుకుంటే, అనేక వ్యాధుల నుండి ఉపశమనం పొందుతారు. అయితే, వర్షాకాలంలో ఈ కూరగాయలు తినడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, ఏ కూరగాయల గురించి వారు హెచ్చరిస్తున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..

### కాలీఫ్లవర్

వర్షాకాలంలో కాలీఫ్లవర్ తినడం మంచిది కాదు, ఎందుకంటే తేమ కారణంగా బ్యాక్టీరియా, పురుగులు పెరిగే అవకాశం ఉంది. కాలీఫ్లవర్‌లో తేమ ఎక్కువగా ఉండటం వలన, అది త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. కడుపు ఇన్ఫెక్షన్లకు కూడా కారణం కావచ్చు.

### వంకాయ

వంకాయలలో కూడా టేప్‌వార్మ్ కనిపించే అవకాశం ఉంది. కోసేటప్పుడు పురుగులు కనిపిస్తే, మొత్తం వంకాయను పారవేయాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కొన్ని పురుగులు వంట తర్వాత కూడా జీవించగలవు, వీటిని తింటే ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది. దాని లార్వా మెదడులోకి ప్రవేశిస్తే, అది ప్రాణాంతక పరిణామాలను కలిగిస్తుంది.

### బీరకాయ

బీరకాయ వర్షాకాలంలో సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఫైబర్ పరంగా గొప్ప కూరగాయ. కానీ వర్షాకాలంలో ఇది కీటకాలతో ఉంటుంది. దానిలో ఉండే పురుగులు చాలా చిన్నవిగా ఉంటాయి. ఈ పురుగులను తింటే, అవి శరీరంలోకి ప్రవేశించి మెదడుకు చేరుతాయి. ఇవి ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి.

### క్యాబేజీ

క్యాబేజీ పొరల మధ్య టేప్‌వార్మ్‌లు దాక్కునే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు చాలా వేగంగా పెరుగుతాయి. వాటిని శుభ్రం చేసి సరిగ్గా ఉడికించకపోతే, వాటి గుడ్లు జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించి శరీరం లోపలికి, మెదడులోకి కూడా చేరుతాయి. మీరు తినాలని అనుకుంటే క్యాబేజీని ఉపయోగించే ముందు నీటిలో మరిగించాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

### క్యాప్సికమ్

క్యాప్సికమ్ లోపలి భాగంలో టేప్‌వార్మ్‌లు ఉండవచ్చు. సరిగ్గా కడగకపోతే, టేప్‌వార్మ్ గుడ్లు శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి.

# ఈ పువ్వు షుగర్ పేషెంట్లకు దివ్యౌషధం!

అరటిపండ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనందరికీ తెలుసు. కానీ అరటి పువ్వు మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో మీకు తెలుసా? అవును. అరటి పువ్వు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇందులో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, పొటాషియం, భాస్వరం, ఇనుము వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు, ఇది అనేక తీవ్రమైన వ్యాధుల నుండి దూరంగా ఉండటానికి సహాయపడుతుంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో దీనిని వివిధ వంటకాల రూపంలో తీసుకుంటారు. ఆయుర్వేదంలో దీనిని ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. ఇన్ని ఉపయోగాలున్న ఈ పువ్వు ఎలాంటి ఆరోగ్య సమస్యలకు మంచిది? దీన్ని ఎందుకు తినాలో తెలుసుకోండి.

### డయాబెటిస్

టైప్ 2 డయాబెటిస్ రోగులకు అరటి పువ్వు ఒక దివ్య ఔషధం. ఇది చక్కెర స్థాయిలను తగ్గించి షుగర్ నియంత్రణకు సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారు ఈ పువ్వును క్రమం తప్పకుండా తినాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

### ఒత్తిడి, నిరాశ దూరం

అరటిపండ్లలో మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు, యాంటీ-డిప్రెసెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి టెన్షన్ తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతే కాదు అవి భయాందోళనలు, నిరాశ ఎదుర్కోవడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. నెగెటివ్ ఆలోచనల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచుతాయి.



### జీర్ణవ్యవస్థ సక్రియం

అరటి పువ్వు ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది కడుపు సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచేందుకు దోహదం చేస్తుంది. కడుపు నొప్పి, వాంతులు లేదా విరేచనాలు వంటి కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతుంటే.. అరటి పువ్వును క్రమం తప్పకుండా తినడం చాలా మంచిది.

### రక్తహీనత

ఇనుము అధికంగా ఉండే అరటి పువ్వు రక్తహీనతను నివారించడానికి ప్రభావవంతమైన ఔషధంగా పనిచేస్తుంది. అంతే కాదు, రక్తహీనతకు సంబంధించిన ఇన్ఫెక్షన్ల నుండి దూరంగా ఉండటానికి కూడా ఇది సహాయపడుతుంది. రక్తహీనతతో బాధపడేవారు అరటి పువ్వును క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకుంటే మేలు.

(NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు నేటిధాత్రి బాధ్యత వహించదు.)

# మన పూర్వీకులు అరటి ఆకుల్లో ఎందుకు తినేవారో తెలుసా?



మన పూర్వీకుల్లో దాదాపు అందరూ అరటి ఆకుల్లోనే తినేవారు. దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో నేటికీ చాలా మంది అరటి ఆకులపైనే తినడానికి ఇష్టపడతారు. సాధారణంగా అయితే పండుగలు , శుభకార్యాలు, వివాహాలు, ఇతర ప్రత్యేక సందర్భాలలో అరటి ఆకుల్లో భోజనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇది మన పూర్వీకుల నుండి వచ్చిన ఆచారం మాత్రమే కాదు, పర్యావరణానికి మేలు చేసే మంచి మార్గం కూడా. కానీ చాలా మందికి దీని ప్రయోజనాల గురించి తెలియదు. ఆయుర్వేదం ప్రకారం, అరటి ఆకులపై తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇంతకీ, అరటి ఆకుల్లో తింటే కలిగే లాభాలేంటి? ఎందుకు మంచిదో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

### రోగనిరోధక శక్తి పెరుగుదల

అరటి ఆకులలో పాలీఫెనాల్స్ అనే యాంటీఆక్సిడెంట్లు, ఇతర సహజ పోషకాలు ఉంటాయి. ఇవి హానికరమైన బ్యాక్టీరియాను నిరోధిస్తాయి. వేడి ఆహారాన్ని అరటి ఆకులపై వడ్డించినపుడు.. ఆకులోని ఈ పోషకాలు తేలికగా ఆహారంతో కలిసిపోయి ప్రత్యేక రుచిని ఇవ్వడంతో పాటు శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుస్తాయి.

### ఆహార రుచిని పెంచుతుంది

మెత్తని అరటి ఆకుపై రుచికరమైన వేడి ఆహారాన్ని వడ్డించినప్పుడు ఒక ప్రత్యేకమైన సహజ వాసన వెలువడుతుంది. ఈ వాసన భోజనాన్ని మరింత రుచికరంగా చేస్తుంది.

### పర్యావరణ పరిరక్షణ

అరటి ఆకులు పూర్తిగా సహజమైనవి. నూరుశాతం భూమిలో కరిగిపోతాయి. వీటిని పారవేసిన తర్వాత సహజంగా కుళ్ళిపోయి నేలకు ఎరువుగా మారుతాయి. ప్లాస్టిక్ లేదా ఇతర పదార్థాల మాదిరిగా ఇవి పర్యావరణానికి ఏ విధంగానూ హాని కలిగించవు.

### వేడి ఆహారం

అరటి ఆకుల్లో వేడి వంటకాలను వడ్డించినపుడు చీలిపోవు. వాటిపై ఉన్న సహజ మైనపు పొర ఆహారం అంటుకోకుండా నిరోధిస్తుంది. అదనంగా, వేడి కారణంగా ఎటువంటి హానికరమైన రసాయనాలు ఉత్పత్తి కావు.


### జీర్ణక్రియకు మంచిది

అరటి ఆకుల్లో తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరుగుతుంది. ఆయుర్వేదం ప్రకారం, ఈ ఆచారం శరీరంలో సానుకూల శక్తిని, ఆరోగ్యాన్ని పెంచుతుంది.

అరటి ఆకుల్లో విటమిన్లు బి, సి, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. వీటిలో ప్రతిరోజూ భోజనం తినడం వల్ల మధుమేహం, అధిక బరువు, అజీర్ణం, ఆస్తమా వంటి సమస్యలు తొలగిపోతాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఈ పద్ధతి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు నేటిధాత్రి బాధ్యత వహించదు.)










చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

ఎక్స్‌క్లూసివ్ నేటిధాత్రి exclusive


# రిజిస్ట్రార్ వా.. రింగ్ మాస్టర్ వా!?

- చిట్ కంపెనీల మూలంగా ఎవ్వరూ నష్టపోవద్దని సీఎం. రేవంత్ రెడ్డి చెప్పారు.
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.
- అందుకు అనుగుణంగా జీవో తెచ్చారు
- అయినా భయం లేకుండా బాధితులకు అన్యాయం చేస్తావా?
- కమీషన్ కోట్లు వస్తున్నాయని కక్కుర్తి పడతావా?
- ప్రజల జీవితాలను ఆగం చేస్తావా?

# “డిఆర్” వై...దుర్మార్గులకు దగ్గరుండి సేవ చేస్తావా?

## ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడతావా? ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తావా?

## నెల రోజుల క్రితం “డిఐజీ” ఆదేశాలిస్తే కాలయాపన చేస్తావా?


పత్రిక ప్రకటన

ఇందుమూలముగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా. జిలా రిజిస్ట్రార్ వరంగల్ గారి పరిధిలోగల **కనకదుర్గ చిట్‌ఫండ్స్ ప్రై.లిమిటెడ్** నందు చిట్టీ వేసి డబ్బులు తిరిగి పొందని ఖాతాదారులకు తెలియజేయునది ఏమనగా మీకు రావలసిన డబ్బులు మీకు చెల్లించుటకు గాను మీ వద్ద కల రశీదులు మరియు తగిన ఆధారాలతో సహాయ చిట్ రిజిస్ట్రార్ గారి కార్యాలయం, వరంగల్ నందు ఈ యొక్క ప్రకటన వెలువడిన రోజు నుండి 7 రోజులలోపు ఫిర్యాదు చేసుకోగలరని తెలియచేయుచున్నాము.

**సం/- డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్,**
**వరంగల్ ఇ.నెం. 1-1-257/9, 100 ఫీట్ల రోడ్,**
**హన్మకొండ జిల్లా - 506004**

బాధిత ప్రజలు చెప్పిన విషయాలతో “నేటిధాత్రి” అందిస్తున్న సంచలన కథనం




- ప్రజల సొమ్ముకు కాపలా దారువా లేక, దొంగలకు సద్ది కడతావా?
- కమీషన్లకు ఆశపడి కంత్రి గాళ్ళతో చేతులు కలుపుతావా?
- కనక దుర్గ చిట్ ఫండ్ కంపెనీకే కొమ్ము కాస్తావా?
- ప్రభుత్వం తెచ్చిన “జీవో” కు విరుద్ధంగా వ్యవహారం నడుపుతావా?
- ప్రజల సొమ్మును కమీషన్లకు ఆశపడతావా?
- బాధితుల సొమ్ము మింగాలని చూస్తావా?
- ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి చిట్ కంపెనీకి ఊడిగం చేస్తావా?
- చిన్నగా పేపర్ యాడ్ ఇచ్చి చేతులు దులుపుకుంటావా?
- సమ్మక్క జాతర సమయం చూసి యాడ్ జారీ చేస్తావా?
- బాధితులు చూడకుండా చేసి మోసం చేస్తావా?
- కనీసం మూడు, నాలుగు పేపర్లలో ఇవ్వాల్సిన యాడ్ ఒక్క పత్రికకు పరిమితం చేస్తావా?
- సరిగ్గా జాతర సమయం చూసి వారం రోజులు గడువిస్తావా?
- మీడియాకు కనీసం ప్రెస్ నోట్ ఇచ్చినా అందరికీ తెలిసేది కదా?
- డిపాజిట్ సోమ్మంతా కంపని మింగేందుకు సహకరిస్తావా?
- ప్రజలకు మొండి చేయి ఇచ్చేందుకు సాయపడతావా?

- జనం సొమ్ము అంటే అంత అలుసై పోయిందా?
- పేదలను మోసం చేస్తే అడిగే దిక్కుండదని అనుకుంటున్నావా?

# అడుగడుగునా “నేటిధాత్రి” నిఘా నేత్రం గమనిస్తూనే వుంటుంది?

## బాధితులకు సొమ్ము న్యాయంగా అందేవరకు అక్షర పోరాటం చేస్తూనే వుంటుంది?

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

హైదరాబాద్, నేటిధాత్రి:

ప్రజల సొమ్మంటే ఎంత అలుసైపోయింది. దాచుకోండి..దోచుకుంటామన్నంత సులువైపోయింది. ప్రజల బలహీనతలను ఆసరా చేసుకొని కొన్ని చిట్ ఫండ్ కంపనీలు చేస్తున్న అరాచకాలకు, కొంత మంది రిజిస్ట్రార్లు తోడు కావడంతో జనం సొమ్ముకు భద్రత లేకుండాపోతోంది. దాచుకున్న సొమ్ము తిరిగి చేతికొస్తుందన్న నమ్మకం లేకుండాపోతోంది. వరంగల్ లో అదే జరిగింది. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కుర్చీలో కూర్చున్న ఓ రిజిస్ట్రార్ వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. గతంలోనే ఓసారి నేటిధాత్రి దినపత్రిక కనకదుర్గ చిట్ ఫండ్ కంపనీ బాదితులను ఎలా మోసం చేస్తోందనే దానిపై అనేక వార్తలు రాసింది. అందుకు రిజిస్ట్రార్లు ఎలా సహకరిస్తున్నారు. కమీషన్లు ఎలా తీసుకుంటున్నారన్న దానిని వెలుగులోకి తెచ్చింది. దాంతో కొంత కాలం చేయాల్సిన మోసాన్ని వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ బాదితులను మోసం చేసేందుకు కొంత సమయం తర్వాత రెడీ అయ్యారు. జనం సొమ్ము కోట్లాది రూపాయలతో ఉడాయించాలని కనకదుర్గ చిట్‌పండ్ కంపనీ పక్కగా ప్లాన్ వేసింది. దివాళా తీసినట్లు నాటకమాడింది. బోర్డు తిప్పేసింది. కాని జరిగింది వేరు. కంపనీ చెప్పింది వేరు. జనం సొమ్మును అప్పనంగా మింగాలని చూసింది. కోట్లాది రూపాయలు ఎగనామం పెట్టాలని చూసింది. అందుకు వక్రబుద్ది కలిగిన కక్కుర్తి రిజిస్ట్రార్లు సహరిస్తున్నారు. దాంతో యదేచ్చగా చిట్ ఫండ్ కంపనీలు ప్రజలకు శఠగోపం పెడుతున్నారు. ఇలా చిట్ కంపనీల మూలంగా ప్రజలు ఎంతో మంది నష్టపోతున్నారు. దాచుకున్న సొమ్ము చేతికి రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. వారిని మోసం చేసేందుకు కంపనీలు పుట్టగొడుల్లా వెలుస్తున్నాయి. వాటి ఆగడాలను నిలువరించేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. బాధితుల సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు దీనిపై దృష్టిసారించారు. ఏ చిట్ కంపనీ అయినా ప్రజలను మోసం చేస్తే, ఆ కంపనీలకు చెందిన ఆస్తులు, ఆ కంపనీకి చెందిన వ్యక్తుల ఆస్దులు జప్తు చేసైనా సరే బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం జీవో కూడా జారీ చేసింది. చిట్ కంపనీలలో చిట్ వేసిన ఏ ఒక్కరూ మోసపోవద్దు. అన్యాయానికి గురి కావొద్దు. అదీ ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. దాంతో కనకదుర్గ చిట్ కంపనీ తప్పని పరిస్తితుల్లో బకాయిా దారులకు సొమ్ము చెల్లించాల్సి వచ్చింది. సుమారు 43 కోట్ల రూపాయల వరకు కంపనీ ప్రజలకు బాకీ పడింది. ఆ సొమ్మును చిట్ కట్టిన వారికి చెల్లించడం ఆ కంపనీలకు సుతారం ఇష్టం లేదు. అదేదో తమ సొమ్ము ప్రజలకు ఇస్తున్నట్లు తెగ బాధపడిపోతున్నారు. కంపనీకి సహకారమందించేందుకు జిల్లా రిజిస్ట్రార్ రంగంలోకి దిగారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకదుర్గకు సాయం అందించేందుకు అంగీకరించారు. దాంతో కంపనీ లేని ఖాతాదారులను కొంత మందిని సృష్టించేందుకు కపట నాటకమాడుతోంది. కంపనీకి చెందిన కొంత మంది వ్యక్తులు చిట్ హొల్డర్లుగా తయారు చేస్తున్నారు. అసలైన బాధితులకు అన్యాయం చేయడానికి సిద్దపడ్డారు. ఈ విషయాన్ని నేటిధాత్రి పసిగట్టింది. మళ్లీ అన్యాయం జరిగేలా వుందని రంగంలోకి దిగింది. జరుగుతున్న అక్రమ వ్యవహారాలపై ఆరా తీసింది. దాంతో కొంత కాలం చెక్‌ల పంపణీ ఆగిపోయింది. అందులోనూ కొంత మోసం చేసినట్లు కూడా వెలుగులోకి వచ్చింది. బాధితులకు అన్యాయం జరుగుతున్న విషయం రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాదికారులు స్పందించారు. మళ్లీ ఒకసారి దినపత్రికల్లో ప్రకటన జారీ చేసి అప్పుడు బాదితులకు సొమ్ము చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాదికారులు ఆదేశాలు జారీ చేసికూడా నెల రోజులకు పైనే అవుతుంది. కాని ఇన్‌చార్జీ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కావాలనే కాలయాపన చేశారు. సరిగ్గా సమ్మక్క సారక్క జాతర సమయంలో అదును చూసి ఓ దిన పత్రికలో చిన్నగా ప్రకటన జారీ చేశారు. ఇది రూల్స్‌కు విరుద్దం. ప్రజలు ఎక్కువగా తిలకించే, చదివే ఓ మూడు నాలుగు పత్రికల్లో ప్రకటనలు జారీ చేయాలి. కాని డిఆర్ మాత్రం ఒక్క పత్రికలో ప్రకటన జారీ చేసి చేతులు దులుపుకున్నారు. అదే పత్రిక అందరూ చదవాలని లేదు. పైగా ఆ ప్రకటన కనిపించేంత పెద్దదిగా ఇవ్వలేదు. ప్రకటన ఇచ్చామా? అంటే ఇచ్చాం..మమ అని పించేలా ఇచ్చారు. నిజానికి ఆ ప్రకటన అసలైన బాధితులకు పూర్తి స్థాయిలో చేరలేదు. సరిగ్గా సమ్మక్క జాతర సమయంలో ఇవ్వడంతో ఇలాంటి ప్రకటన ఒకటి వచ్చిందన్న సంగతి కూడా తెలియకుండాపోయింది. పైగా ఆ ప్రకటన జారీ అయిన వారం రోజుల్లో బాదితులు తమ వద్ద వున్న ఆధారాలు సమర్పించాలని అన్నారు. ఆ ప్రకటన జారీ చేసి అప్పుడే ఆరు రోజులౌతోంది. కాని అసలైన బాదితులకు సమాచారమే చేరలేదు. కొంత మందికి బాదితులకు ఈ విషయం చేరడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు చేరుకున్నారు. అక్కడ కార్యాలయ సిబ్బంది, డిఆర్ చెప్పిన మాటలు విని విస్తుపోయారు. చిట్ కంపనీకి చెందిన వ్యక్తికి ఆదారాలు సమర్పించాలని డిఆర్ బాదితులకు సూచించారు. దొంగ చేతికి తాళాలు ఇమ్మన్నట్లుగా ఆదారాలన్నా చిట్ కంపనీ వ్యక్తికి అందజేస్తే ఆదారాలు మాయమైపోవా? మోసం మళ్లీ మొదటికి రాదా? బాదితుల వద్ద ఆధారాలు లేకుండా చేయాలని డిఆర్ , కంపనీ ప్రతినిధులతో కలిసి కుట్ర చేశారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. నిజానికి ఆ ఆధారాలను ఒక ప్రభుత్వ అధికారిగా డిఆర్ తీసుకోవాలి. వాటిని పరిశీలించి చెక్కులు జారీ చేయాలి. కాని డిఆర్ కార్యాలయంలో కంపనీ ప్రతినిధిని కూర్చోబెట్టి బాధితుల వద్ద వున్న ఆదారాలు సమర్పించాలన్నప్పుడే అసలు గుట్టు బైటపడింది. ఇలా ఒకరిద్దరు కంపనీ ప్రతినిధి వద్దకు వెళ్తే వారికి రావాల్సిన సొమ్ముకన్నా అధికంగా రుసుము రాసి చెక్కు అందజేస్తాం? అదనంగా చెక్కుపై రాసిన సొమ్ముకు బాదితులు ఒక చెక్ ఇస్తే రుసుము చెల్లిస్తామని చెప్పడం జరుగుతోంది. అంటే చిట్ కంపనీ డిపాజిట్‌కు చెందిన సొమ్ముంతా ఒక్కసారిగా ఖాళీ చేసి, కంపనీ చేతులెత్తేసేందుకు డిఆర్ పక్కా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు అర్థమౌతోంది. అటు కంపనీలో చిట్ వేయని అనుయాయుల చేత సంతకాలు చేయించి, దొంగ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు? వాటికి తోడు బాధితులకు కట్టిన సొమ్ముకు అదనంగా కొన్ని రెట్ల సొమ్మును చెక్ మీద రాసి, ముందే వారి నుంచి చెక్కులు తీసుకుంటున్నారు. ఇలా రెండు రకాలుగా బాదితులను వంచిస్తున్నారు. డిపాజిట్ సొమ్మంతా మింగేయాలని చేస్తున్నారు? ఇలా డిఆర్ చెక్కులు జారీ చేయడానికి పెద్దఎత్తున ముడుపులు తీసుకునేలా ఒప్పందం జరిగినట్లు కూడా విశ్వసనీయ సమాచారం. కోట్ల రూపాయలు చేతులు మారేలా, డిఆర్ జేబులు నిండేలా చూసుకుంటూ, కంపనీకి మేలు చేసే కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు వ్యూహం పన్నారు. నలుగురు బాదితులకు బకాయిలు చెల్లించిన చేతులు దులుపుకొని, కంపనీ డిపాజిట్ సొమ్మంతా తినేందుకు పథకం వేశారు. ఇది ఒక్క కనకదుర్గ చిట్ కంపనీ వ్యవహరమే కాదు. తెలంగాణలో వున్న దాదాపు అన్ని చిట్ కంపనీలు సాగిస్తున్న వ్యవహారమే. తెలంగాణలో సుమారు 12వందల కోట్ల రూపాయలను ఇలా ఎగవేసేందుకు కంపనీలు కుట్రలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఒక్క కనకదుర్గ చిట్ కంపనీ ఏకంగా 43 కోట్లు బాధితులకు కుచ్చు టోపి పెడుతోంది. అయితే ఇది ఒక్క వరంగల్ బ్రాంచ్ మాత్రమే. తెలంగాణలో కనకదుర్గ కంపనీకి అనేక బ్రాంచ్‌లున్నాయి. వాటిపై కూడా అదికారులు దృష్టిపెడితే అసలు బాగోతం అంతా బైటపడుతుంది. బాదితులకు కొంతైనా న్యాయం జరుగుతుంది!

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999